Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

గురువారం, జూన్ 18, 2026 | సంపుటి - 20 | సంచిక 265 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## సైబర్ నేరస్థులు పరాన్నజీవులు



**ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు**

**సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా..

2లో



## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీకాదు

**ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది**

**ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం**

**సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు**

**అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు**

**కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం**

**రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్**

**స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**

రంగారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ..

2లో



## రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

**75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన**

**గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

2లో




## గ్యాస్ వినియోగదారులకు మెలిక

**30లోగా కెవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి**

న్యూఢిల్లీ : వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు.

## 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా అంత స్కామ్ సాధ్యమా

**హరీష్ వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం**



హైదరాబాద్ : తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారుని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

2లో

## రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే

**దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది**

**జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా**

**ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం**

**సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే**

**పాలేరు నియోజకవర్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్**



ఖమ్మం : రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్య కర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..

2లో



## వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

**అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ**

**వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం**

**భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు**

వరంగల్ : ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం.

తరువాయి 2లో



## నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

**పెమ్మసానితో కలసి పూజ చేసిన లోకేశ్**

**రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం**

గుంటూరు : నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు

తరువాయి 2లో

## యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి




**21 యోగా దినోత్సవానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి**

**అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు సూచన**

అమరావతి : అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన

తరువాయి 2లో

# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తాస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఔఅఖీః) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడికి కుట్ర

## ముందే పసిగట్టి అడ్డుకున్న ఇంటిలిజెన్స్

వాషింగ్టన్,జూన్17 : అమెరికా అధ్యక్ష భవనంపై భారీ ఉగ్రదాడి చేసేందుకు పన్నిన కుట్రను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భగ్నం చేసింది. డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టిన రోజు సందర్భంగా వైట్‌హౌస్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, స్నైపర్లతో దాడి చేయాలని కొందరు వ్యక్తులు పన్నిన కుట్రను అధికారులు ముందుగానే గుర్తించి అడ్డుకున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. నిందితులు ఐదుగురిలో ఒకరైన 19 ఏళ్ల టైసెన్ ప్రాపర్ తల్లి ఇచ్చిన సమాచారంతోనే ఎఫ్‌బీఐ ఈ కుట్రను భగ్నం చేసింది. గూఢచర్యం, భారీగా ఆయుధాలు కొనుగోలు చేయడం, హిట్ అండ్ రన్ మిషన్ల గురించి కొందరితో అతడు మాట్లాడుతుం డడాన్ని ఆమె గమనించి అనుమానించింది. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. దీంతో ఎఫ్‌బీఐ అప్రమత్తమై నిందితులను అదుపులోకి తీసుకుంది. ఎఫ్‌బీఐ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. నిందితులు పేలుడు పదార్థాలు అమర్చిన డ్రోన్లతో వైట్‌హౌస్ సమీపంలోని భవనాలపై దాడి చేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనుకున్నారు. అనంతరం బయటకు పరుగులు తీసే ప్రజలపై స్నైపర్లతో కాల్పులు జరపాలనుకున్నారు. కొందరు నిందితులు ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా ప్రణాళికలు రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ దీనిని ఒక పెద్ద ఉగ్రదాడి కుట్రగా అభివర్ణించారు. సరైన సమయంలో చర్యలు తీసుకోకపోయి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించేదని పేర్కొన్నారు. ఈ బృందంలోని వ్యక్తులకు ఒకరితో ఒకరికి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. వీరంతా ప్రభుత్వ వ్యతిరేకులని, లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఞ్లైపై ట్రంప్ యంత్రాంగం తీరుతో నిరాశ చెందిన వారని, యూదు వ్యతిరేకులని పేర్కొన్నారు. ప్రస్తుతం అరెస్టు చేసిన వారిపై అధికారులు పలు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్


ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటీన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే

కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

# గ్యాస్ వినియోగదారులకు మెలిక

ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ



లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్జ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

# యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఈ రిక్షా

## ఆరుగురు మహిళలు దుర్మరణం

లక్నో,జూన్17 : ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ఈ రిక్షా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, బదౌన్ జిల్లాలో, బరేలి-మధుర హైవేపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వానా గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు ఒక ఈరిక్షాలో బంధువుల ఇండ్లకు బయల్దేరారు. తమ ఇంట్లో పెళ్లికి ఆహ్వానించడానికి వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వెళ్తుండగా, ముందు ఉన్న ట్రాక్టర్‌ను దాటుకొని ముందుకు వెళ్లేందుకు ఈరిక్షా డ్రైవర్ ప్రయత్నించాడు. ఒక ట్రాక్టర్‌ను దాటుకుని వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను ఈరిక్షా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలోని మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్ షాని సహా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జును÷-జజైంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నంచేశాయి. కానీ, అప్పటికే ఆరుగురు మరణించారు. గాయపడిన ముగ్గురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ రిక్షా డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మరోవైపు ఘటనకు కారకులైన రెండు ట్రాక్టర్లకు చెందిన డ్రైవర్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సంబంధించిన వారి ఇంట్లో ఈ నెల 29న వివాహం జరగాల్సి ఉంది. మరోవైపు ఈ ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# జొన్నల కొనుగోలుకు లంచం డిమాండ్

## మనస్తాపంతో రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్,జూన్17 : రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పులు చేసి పంటలు పండిస్తే కొనేనాథుడు లేక వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నుగూరే పాండురంగ్(48) అనే రైతు తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేశారు.

# ఆరుట్లలో సరదాగా గడిపిన సిఎం రేవంత్

**విద్యార్థులతో కలసి బ్రేక్ ఫాస్ట్..**

**ఫుట్ బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన సిఎం**

రంగారెడ్డి,జూన్17 : రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో జిల్లాకు చేరుకున్న సీఎం.. హెలిప్యాడ్ నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్ వరకు పాఠశాలకు చెందిన బస్సులో ప్రయాణించారు. అనంతరం టీపీఎస్‌ను ప్రారంభించి.. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో మాట్లాడారు. ప్రీ-ప్రైమరీ విభాగాలను సందర్శించారు. పాఠశాల లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను సందర్శించిన సీఎం.. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సీఎం మొక్క నాటారు. డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌ను సందర్శించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కిచెన్‌ను సందర్శించి పూరీలు చేశారు. మొత్తంగా సరదాగా గడిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆరుట్లలో బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# విద్యుత్ తీగలకు అడ్డంగా చెట్లు

**కొమ్మలు నరుకుతుండగా షాక్‌తో కూలీ మృతి**

హైదరాబాద్,జూన్17 : నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒక అపార్ట్‌మెంట్ ముందున్న చెట్టు కొమ్మలను నరుకుతున్న సమయంలో ఒక దినసరి కూలీ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కరెంట్ సరఫరా అవుతున్న తీగలు తగలడంతో సూర్యనారాయణ (45) అనే ఆ కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు సూర్యనారాయణ రోజువారీ కూలీ పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సూర్యనారాయణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటిని నడిపించే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో దారుణం

**నర్స్ కాన్పు చేయడంతో తల్లీబిడ్డా మృతి**

భద్రాద్రి కొత్తగూడెం,జూన్17 : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నర్సు కాన్పు చేసింది. కానీ ప్రసవం అనంతరం తల్లీబిడ్డ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. గుండాల మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి వనజ (20)కు పురిటినొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో అక్కడ ఉన్న నర్స్ సాధారణ ప్రసవం చేసింది. కానీ కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నవజాత శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా తెలిపారు. మరోవైపు కాన్పు అనంతరం తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె, మనమడు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నమిలె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**పురోగతిని పరిశీలించిన హౌజింగ్ పిడి**

యాదాద్రి భువనగిరి,జూన్17 : రాజాపేట మండలంలోని నమిలె గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ పీడీ లక్క అలివేలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించి పనుల నాణ్యత, నిర్మాణ వేగం, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన హౌసింగ్ పీడీ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామంలో చేపడుతున్న పనులపై స్థానిక ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఆమె, నిర్మాణాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో రాజీ పడకుండా అన్ని పనులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి రాజు, ఉప సర్పంచ్ మార్క శివకుమార్, గ్రామ నాయకులు మాయకోటి రాజు, బొమ్మగాని శ్రీను, మార్కెట్ డైరెక్టర్ సీలేవేరు బాలరాజు, హౌసింగ్ ఏఈ వేముల వివేక్, పంచాయతీ కార్యదర్శి ఎండీ జెమిల్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి**

**పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు**

**కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి**



హైదరాబాద్,జూన్17 : రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

**రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం**

**రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

కరీంనగర్,జూన్17 : ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

# అదృశ్యమైన వ్యక్తి శవంగా గుర్తింపు

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు**

ఖమ్మం,జూన్17 : అదృశ్యమైన వ్యక్తి శవమై తేలిన ఘటన కారేపల్లి మండలం పోలంపల్లిలో వెలుగుచూసింది. పోలంపల్లికి చెందిన అవివాహితుడు మూతి వీరభద్రం (43) అదే గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. 25 రోజుల క్రితం వెస్టేజ్ కంపెనీ మీటింగ్ ఉందని ఇంటి నుండి వెళ్లాడు. రెండు రోజులైన ఇంటికి రాకపోవడం సెల్ ఫోన్ స్విఛాఫ్ ఉండడంతో తల్లిదండ్రులు మూతి బుచ్చిరాములు-లక్ష్మి తమ బంధువుల గ్రామాల్లో వాకబు చేసిన వీరభద్రం జాడ కనిపించలేదు. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవి మండలం గుట్టమల్ల సమీపంలోని జామాయిల్ తోటలో శవం ఉందని అక్కడి స్థానికులు పోలీసులకు తెలుపడంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. శవం వద్ద సెల్ ఫోన్, ఆధార్ కార్డు పడి ఉండడంతో దాని ఆధారంతో వీరభద్రంగా గుర్తించి కారేపల్లి పోలీసుల ద్వారా పోలంపల్లికి కబురు చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లిన వీరభద్రం తల్లిదండ్రులు, సోదరుడు సుధాకర్ శవాన్ని గుర్తించారు. మృతదేహం కుళ్లి పోయి ఉండడంతో పోలీసులు అక్కడే శవ పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు లక్ష్మిదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కృషి

**కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం**

భద్రాద్రి కొత్తగూడెం,జూన్17 : గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారంర బూర్గంపహాడ్ మండలంలో పర్యటించిన ఆయన బూర్గంపహాడ్ మండల కేంద్రంలో రూ.65 లక్షల అంచనాతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు పూర్తయితే రవాణా సౌకర్యవంతం గా ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్‌లో తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని 34 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించడంతో పాటు 25 మందికి రూ.13 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, సర్పంచులు మందా నాగరాజు, బాదం వెంకటేశ్‌రెడ్డి, పోతినేని సూరమ్మ, సర్పా నాగమణి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ పాల్గొన్నారు.

# కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌లాల్ పుస్తకం

**'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' ఢిల్లీలో ఆవిష్కరణ**

హనుమకొండ,జూన్17 : కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ రచించిన 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' పుస్తకాన్ని బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేంద్ర దేవ్ మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణలులేని సమాజ నిర్మాణానికి ఈ పుస్తకం దార్శనికతతో కూడిన ఆచరణాత్మక మార్గదర్శకాన్ని అందిస్తుందని తెలిపారు. పుస్తక రచయిత సురేష్‌లాల్ మాట్లాడుతూ సున్నా పేదరికం, నిరుద్యోగం, అసమానత, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణ అనే ఐదు ప్రధాన లక్ష్యాల ఆధారంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ శాంతి సాధనకు అవసరమైన విధానాలను ఈ గ్రంథంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కేస్ స్టడీలు, నిపుణుల విశ్లేషణలు, కార్యాచరణ వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాల పరస్పర అనుసంధానాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ చేతన్ గాటే, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.డి.ఎన్. భాజ్‌పాయ్, జనరల్ సెక్రటరీ రవీంద్ర బర్మే, ప్రముఖ ఆర్థికవేత్త అశ్విని మహాజన్ పాల్గొని సురేష్‌లాల్‌ను అభినందించారు.

# మైనర్ బాలికపై అత్యాచారం..హత్య

**పోక్సో కేసులో 20ఏళ్లు...హత్య కేసులో యావజ్జీవం**

**నిందితుడికి శిక్ష విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు**

రాజన్నసిరిసిల్ల,జూన్17 : మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసుతోపాటు, అదే బాలికను హత్య చేసిన కేసులో నిందితుడు బండపల్లి నవీన్ కుమార్ (27)కు పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బండపల్లి నవీన్ కుమార్‌కు చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. 2019 మార్చి 13న బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం 2020 డిసెంబర్ 4న నిందితుడు బాలికను ఆమె ఇంటి నుంచి అపహరించి గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసిన అనంతరం జరిగిన విషయాన్ని బయటపెడుతుందనే భయంతో బాలికకు విషం తాగించి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను నిందితుడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు హత్య, అత్యాచారం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులు సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చాయి. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరాలు రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.7,000 జరిమానా, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసుల్లో నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, లతీఫ్, నవీన్, వెన్నెలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.

# పుల్వామా తరహాలో మరో దాడికి ఎత్తు

**ఐఎస్ఐ ఉగ్రవాదుల ముఠా అరెస్ట్**

న్యూఢిల్లీ,జూన్17 : పాకిస్థాన్ గూఢచారి సంస్థ అయిన ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్రముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా.. వారిలో ఆరుగురు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. గాజియాబాద్‌లో అరెస్టయిన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు పంపినట్లు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాక్ ప్లాన్ చేస్తోందనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు గల ప్రముఖ రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ సంబంధిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి భారత సైనికుల కదలికలను గుర్తించేందుకు యత్నించినట్టు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వీరు ఢిల్లీలోని కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద అలాంటి కెమెరాలను అమర్చినట్టు గుర్తించారు. దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భారతీయ ఫోన్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశీయులకు పంపిస్తూ వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహించుకునేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సిమ్ కార్డుల చోరీ, గతంలోనే యాక్టివేట్ చేసిన సిమ్‌లను కొనుగోలు చేయడం వంటివి వినియోగించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలనూ తమ సొంత అకౌంట్ల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళ్లుగప్పేందుకు యత్నించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపైనా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

**విమానాశ్రయ పనులు పరిశీలించిన శ్రీనివాసవర్మ**

విజ.యవాడ,జూన్17 : గన్నవరం విమానాశ్రయంలో నూతన టెర్మినల్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రం నడిబొడ్డున ఉన్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దేశానికే తలమానికంగా అభివృద్ధి చేసి చూపిస్తామని భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందుతోందన్నారు. ఏపీలో 8500 కిలోమీటర్ల జాతీయ రహదారిని ఎన్డీయే హయాంలో విస్తరించామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విమాన సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాల కన్నా ఎక్కువ నాణ్యతగల విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఉడాన్ పథకంతో దేశంలోని చిన్నా, మధ్యతరహా విమానాశ్రయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంతో విమాన సౌకర్యం ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి రానుందన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమానాశ్రయ డిజైనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్

ఆసిఫాబాద్,జూన్17 : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండలంలోని పాట్నాపూర్ సర్పంచ్ ఖందరే లక్ష్మిబాయి బాలాజీ బుధవారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే కోవలక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ తెలంగాణ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజాప్రతినిధులు తిరిగి రావడం పార్టీపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొడప్ప ప్రకాష్ ,శివునూర్ సర్పంచ్ జాదవ్ శ్రావణ్, కోలాం శంకర్, మనకు గూడా సర్పంచ్ దేవుషా, యశోదాబాయి కేశవ్, దుబ్బగూడా సర్పంచ్ మాడవి కౌశల్య, దబోలి సర్పంచ్ మెస్రం గంగాదేవి భావురావ్, మాడవి నాగురావ్, మాజీ సర్పంచ్ మాడవి భీంరావ్ , నాయకులు ముండే సతీష్, సమాధాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విద్యార్థులకు నీట్ కటకటలు!

నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్-యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ ప్రక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు. అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకున్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్‌సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది..

# ఇథనాల్ కాలుష్యం ఇంతింతకాదయా!




వ్యవసాయమే జీవన ఆధారంగా జీవిస్తున్న రైతుల గుండెల్లో ఇథనాల్ కంపెనీలు అలజడులు రేపుతున్నాయి. పచ్చని పంట పొలాల మధ్యన కాలుష్యం వెదజల్లే ఇథనాల్ కంపెనీలు మాకొద్దంటూ గ్రామాల రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కల్గించే ఈ ఇథనాలు కంపెనీలను ప్రభుత్వాలు ఎలా అనుమతి ఇస్తాయని మేధావులు నిలదీస్తున్నారు. బలవంతంగా, దౌర్జన్యంగా గ్రామాలకు గ్రామాలు ఖాళీచేయించే విధంగా ఇథనాల్ కంపెనీలు పాలమూరు జిల్లాలో చిచ్చురేపుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణా, తుంగభద్ర నదులు వేలాది మంది రైతులకు జీవనాధారం, లక్షల ఎకరాలకు, సాగునీరు, తాగునీరు అందించే జీవనదులు. ఇలాంటి జీవనదులు ఈ ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు జరిగితే కాలుష్యం బారినపడే అవకాశాలు ఉన్నాయని, తద్వారా అది మానవాళి, జంతుజాలం ప్రాణాలపై ప్రభావంపడే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఇథనాల్ కంపెనీలు ఏర్పాటుకు సన్నద్ధం అవుతున్నాయి. అదే సందర్భంలో గ్రామాల్లో రైతులు ఇథనాల్ కంపెనీలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమ బాటపడుతున్నారు. ఆ రైతులపై కేసులు నమోదు అవుతున్నా ముందుకే కదులుతున్నారు. అన్నంపెట్టే రైతులపై కేసులు నమోదు చేయడంలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం గమనార్హం. ఎన్నికలకు ముందు అప్పట్లో ఇథనాల్ కంపెనీలను పాలమూరులో ఎత్తివేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పిసిసి నేతగా ఉన్న సమయంలో డిమాండ్ చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో ఐజ మండలం పెద్ద దన్వాడలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దన్న రైతులపై పోలీసులు కేసులు నమోదు చేసి గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా నారాయణపేట జిల్లా చిత్తనూర్ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు సమయంలో మాకు వద్దని ఆందోళన చేసిన రైతులపై అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడి రైతులపై లాఠీలతో కొట్టించి కేసులు నమోదు చేసింది. మరిన్ని కనుగొనండి వీడియో వార్తల సేవ అంతర్జాతీయ వార్తల సేవ తాజా వార్తలు సేవ ాూశ్రీంశీ =ముఃః - భరోసా ఇవ్వాలి 'సర్' ఇప్పుడు బిఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేయడం ఇరు పార్టీల ద్వంద్వ నీతికి నిదర్శనం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి వనరులు పెరిగి వరి పెద్దఎత్తున సాగవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇథనాల్ కంపెనీలకు కేంద్రం అందించే సబ్సిడితోపాటు ఇతర సదుపాయలను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు బడా రాజకీయ పార్టీలు (అన్ని పార్టీల నేతలు) ఈ కంపెనీల ఏర్పాటులో ముందుకు వచ్చాయి. బడా వ్యాపారవేత్తలతోపాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు సభ్యులుగా ఉంటూవచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా పది ఇథనాల్ కంపెనీలు ఏర్పాటు చేయాలన్నది లక్షంగా ముందుకు వచ్చారు. అందులో భాగంగానే పేద జిల్లా, కరువు జిల్లా ఉమ్మడి పాలమూరు జిల్లాను అనువైన జిల్లాగా మలుచుకున్నారు. వలస జిల్లాగా ఉన్న ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులన్నీ పూర్తయి పుష్కలంగా సాగునీరు వచ్చి రెండు పంటలు వేసుకొని హాయిగా జీవిస్తున్నారు. వలసలు వెళ్లకుండా ఇక్కడే పిల్లాపాపలతో జీవిస్తున్నారు. అయితే ఇప్పుడు తిరిగి వారి గుండెల్లో ఇథనాల్ కంపెనీలు గునపాలు గుచ్చుతున్నాయి. దీంతో వారు తిరిగి ఆందోళన బాట పట్టారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో పూర్తిగా వెనుకబడిన జిల్లాగా ఉన్న నారాయణపేట జిల్లాలో మరికల్ మండలం చిత్తనూర్ గ్రామంలో జూరాల ఆర్గానిక్ పేరుతో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారు. చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారంతోపాటు మరో ఐదుగ్రామాల పరిధిలో వందల ఎకరాలు పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా ఉండేది. ఇక్కడ కోయల్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా నీరు అందడంతో సాగునీటి వనరులు పెరిగి పంటలు పండించుకునే వారు. ముందుగా ఇక్కడ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయడం లేదని చెప్పి లోలోపల నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకున్నారు. ఏకంగా 408 ఎకరాలను రైతులవద్ద నుంచి చవక ధరకు కొనుగోలు చేసి 32 ఎకరాల్లో ప్యాక్టరీ ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో ఒక్కడ మద్యం ఫ్యాక్టరీ, మరో మందుల ఫ్యాకర్టీ ఏర్పాటు చేయాలన్నది వారి లక్షం. అయితే వీటి ఏర్పాటుకు చట్ట ప్రకారం పర్యావరణ అనుమతులు పొందాలి. ఇల్లాలే జగతికి జీవనజ్యోతి పచ్చని పంట పొలాలు, గ్రామాల మధ్యన కాకుండా ఎందుకు పనికి రాని అసైన్డ్ భూముల్లో ఈ ఇథనాల్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.అయితే ఇక్కడ పచ్చని పంటలున్నా, గ్రామ పంచాయితీ తీర్మానాలు లేకుండా అనుమతులు తీసుకున్నారు. ఆ తర్వాత ఇక్కడ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారు. కొంత కాలానికి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఫ్యాక్టరీ వ్యర్థాలనుంచి చెడువాసన, శరీరంపై దుద్దుర్లు, అనారోగ్యానికి గురికావడంతో ఆందోళనకు గురయ్యారు. గత కొంతకాలంగా ఐజ మండలం పెద్ద దన్వాడలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై రైతులు తిరగబడినప్పటికీ యథావిధిగా ప్లాంటు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా పొలాలు, గ్రామాల మధ్యన ఇథనాల్ కంపెనీ ఏర్పాటు వెనుక బడాబాబుల ధనార్జనే లక్షం కనిపిస్తోంది. కాలుష్యంతో తమ గ్రామాలు నాశనం అవుతాయని భావించిన ఇక్కడి రైతులు వ్యతిరేకిస్తున్నారు. గద్వాల జిల్లా జింకలపల్లి దగ్గర ఒక ఇథనాల్ కంపెనీ నడుస్తోంది. ఇక్కడ కూడ చుట్టుప్రక్కన గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో బిపిసిఎల్ ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన పరిశీలనలో ఉంది. దాదాపు రూ. 1000 కోట్ల పెట్టుబడితో రోజుకు 5 లక్షల లీటర్ల 1జి గ్రెయిన్ బేస్డ్‌తో 100 ఎకరాల భూమి రోజుకు 4 వేల కెఎల్ నీటితో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2021 ఇథనాల్ పాలసీ తర్వాత 30 ఇథనాల్ కంపెనీలు అనుమతి పొందాయి. దేశంలోనే తెలంగాణలోనే ఇథనాల్ ప్లాంట్లు అధికంగా ఉండడం ఆందోళన కలిగించే విషయంగా చెప్పవచ్చు.

## హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు సరికాదు

**ఒక నియంత పేరు పెట్టడం ఎంతవరకు సబబు**

**సిఎం రేవంత్ నిర్ణయాన్ని తప్పుపట్టిన సిపిఎం**



న్యూఢిల్లీ,జూన్17 : హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పక్కన ఉన్న రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నేత హో చి మిన్ గౌరవార్థం కోల్‌కతాలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల ఉన్న హారింగ్టన్ వీధికి ఆయన పేరు పెట్టారని ఈ సందర్భంగా బేబి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాలంలో అమెరికా.. ఇరాన్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దౌర్జన్యం చేయడం వంటి చర్యల ద్వారా మానవాళిపై సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్‌లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్‌ను గౌరవిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రహదారికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం సరికాదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా సైన్యం ఒక నిరాయుధ వాణిజ్య నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చిందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం ఇటువంటి దాడులను కొనసాగిస్తామని బెదిరిస్తున్నప్పటికీ, ఈ దారుణమైన క్షిపణి దాడిపై భారత ప్రభుత్వం తగిన రీతిలో నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించారని అన్నారు. దీన్నిబట్టి దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకోవడానికి బిజెపికి ఎటువంటి సంకోచం లేదని స్పష్టమవుతోందని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఈ వివాదాస్పద నిర్ణయాన్ని ఉపసంహరించు కునేలా కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోవాలని తాను ఆశిస్తున్నట్లు ఎం.ఎ. బేబి పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని, ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

## నేటినుంచి శుభముహూర్తాలు


**మోగనున్న పెళ్లి బాజాలు**

**పశ్చిమాసియా యుద్ధంతో పెరిగిన ఖర్చులు**

విజయవాడ,జూన్17 : తెలుగు లోగిళ్లల్లో పెళ్లి బాజాల సందడి మొదలైంది. గత నెలన్నర రోజులుగా అధిక జ్యేష్ఠ మాసాల వల్ల ఆగిపోయిన శుభకార్యాల హడావుడి ఇప్పుడిప్పుడే ఊపందు కుంటోంది. జూన్ 15 నుంచి నిజ జ్యేష్ఠ మాసం ప్రవేశించడంతో పెళ్లిళ్ల హడావుడి షురూ అయ్యింది. జూన్ 18 నుంచి జులై 9 వరకు మాత్రమే పరిమితంగా శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఆ తర్వాత మళ్లీ జులై 15 నుంచి ఆషాఢమాసం, గురుమూఢం మొదలై ఆగస్టు 15 వరకు బ్రేక్ పడనుంది. తిరిగి శ్రావణ మాసం వస్తేనే గానీ మళ్లీ శుభకార్యాలు జరగవు. ఈ కాస్త గ్యాప్‌లోనే పెళ్లిళ్లు కానిచ్చేయాలని అందరూ ఒకేసారి ప్రయత్నిస్తుండటంతో మార్కెట్లో విపరీతమైన పోటీ ఏర్పడింది. సమయం తక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని పురోహితులు, ఫంక్షన్ హాళ్ల యజమానులు, డెకరేటర్లు అందరూ డిమాండ్‌ను బట్టి రేట్లు పెంచేస్తున్నారు. అయితే, ఈ సంతోషాల వెనుక పెళ్లి పెద్దలకు ఒక పెద్ద బ్జడెట్ సవాల్ ఎదురవుతోంది. ప్రస్తుతం చేతిలో ఉన్న సమయం చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. మరోవైపు అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం తెలుగు లోగిళ్ల పెళ్లిళ్లపై గట్టిగానే పడుతోంది. యుద్ధ వాతావరణం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు, వాహనాల కిరాయిలు భారీగా పెరిగాయి. అలాగే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరల పెరుగుదలను సాకుగా చూపిస్తూ క్యాటరింగ్ నిర్వాహకులు ప్లేటు ధరలను పెంచేశారు. సమాజంలో హోదా కోసం కనీసం పాతిక రకాల వంటకాలతో విందు వడ్డించడం రివాజుగా మారడంతో, ఇప్పుడు ప్లేటు ధర కనీసం రూ.500 దాటుతోంది.

## భవిష్యత్ ప్రణాళిక ఆవశ్యం!

తిరుమల : జీవితంలో ప్రణాళిక అవసరం. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని విభజించుకుని సాగాలి. ఈ క్రమంలో భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలా మందికి ఉండదు. ఎందుకంటే మనం వర్తమానానికి బందీలం. పక్కనేఉన్న ప్రమాదాలను, సంతోషాలను అధిగమించి పనిచెయ్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించే దానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబోతున్నాయని ఊహించడంనేర్చుకోవాలి.సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం- మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగాఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు.ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పుపెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనంద పడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయోగించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.పనులు ప్రారంభించేటప్పుడు వ్యవహారం నడిపేది మనం. వాటిని ఒక పద్ధతిలో నడిపించేది మనమే. ఒకసారి అవి ప్రారంభమయ్యాక, చాలాసార్లు అవే మనకు దారి చూపిస్తాయి. మన లక్ష్యాన్ని నెరవేరుస్తాయి!



ఆధ్యాత్మికం

# దళితులపై దాడులను అరికట్టాలి....

**● నిందితులపై కేసులు నమోదు చేయాలి, లేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం ● దళిత సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతల హెచ్చరిక**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న దళితులపై దాడులను అరికట్టాలని, నిందితుల పై కేసులు నమోదు చేయాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని దళిత సంఘాల నేతలు హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మూన్ ఫంక్షన్ హాల్‌లో పాటకుల మహేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జిల్లాలో దళితులపై పెరుగుతున్న దాడుల అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ వర్గాలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత యంత్రాంగం నుంచి తగిన స్పందన కనిపించడం లేదని ఆరోపించారు. రేణుక ఎల్లమ్మ దేవాలయానికి బోనాలు తీసుకెళ్లిన దళితులను అడ్డుకుని దాడి చేసిన ఘటనలో ఇప్పటివరకు నిందితులపై కేసులు నమోదు చేయకపోవడం బాధాకరమన్నారు. దళితులపై జరుగుతున్న దాడులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితిలో, బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడం లేదని, దళితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళితులపై పెరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26న జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన 59 దళిత కులాల నాయకులతో మరోసారి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ముందుగా జిల్లా కలెక్టర్, డీసీపీకి వినతి పత్రాలు సమర్పిస్తామని, అయినప్పటికీ నిందితులపై చర్యలు తీసుకోకపోతే పదివేల మంది దళితులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. విన్నపాలు, నిరసనలతో మాత్రమే న్యాయం జరగదని, హక్కుల సాధన కోసం ఉద్యమమే మార్గమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపన్న, సీనియర్ నాయకుడు కోటగిరి పాపయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్, రామిల్ల శారద, మహేష్‌బాబు, రామలక్ష్మీ, పోతుల ప్రవీణ్, ఉండేంటి ప్రభాకర్, బొల్లం లక్ష్మణ్, మల్యాల నరసింగ, వ్యాసల చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్‌లో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ గుండె శస్త్రచికిత్స

**● కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్**



**కరీంనగర్ టౌన్, జూన్17(ది క్రైమ్ న్యూస్):** మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియోవాస్క్యులర్ సర్జరీని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతకాలంగా ఛాతినొప్పి, తీవ్రమైన ఆయాసం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న జగిత్యాలకు చెందిన 54 ఏళ్ల మాధవి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి రాగా, వైద్య పరీక్షల్లో ఆమె గుండెలోని ప్రధాన మైట్రల్ వాల్వ్ మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహిస్తారని, అయితే ఆ పద్ధతిలో రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఛాతి కింది భాగంలో చిన్న గాటు ద్వారా మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిలో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు వివరించగా వారు అంగీకరించడంతో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ వల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గడమే కాకుండా, రోగి వేగంగా కోలకుంటుందని వివరించారు. ప్రస్తుతం మాధవి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్యసేవలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలో అందించి, కొత్త జీవితం ప్రసాదించిన మెడికవర్ వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ, డాక్టర్ వాసుదేవరెడ్డి, అనెస్థీషియా డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో విద్యను వ్యాపారం చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజుల దందాను అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ )ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపబడుతోంది. ముఖ్యంగా స్కూల్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్‌లు మరియు ఇతర సానిటరీ ఐటమ్స్ వంటి వస్తువులను విద్యాసంస్థలే బలవంతంగా అమ్మిస్తూ అక్రమ వాణిజ్యానికి పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల వలన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది విద్యను వ్యాపారంగా మార్చే ప్రమాదకర పరిస్థితికి దారితీస్తోంది. కాబట్టి ప్రైవేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని స్కూల్స్ ద్వారా బలవంతంగా యూనిఫామ్స్, పుస్తకాలు మరియు ఇతర వస్తువుల విక్రయాన్ని నిలిపివేయాలని విద్యా హక్కు చట్టాన్ని (ఇజు-ూామ్) పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకొని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని చెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు గంప నరేష్, సాయి చరణ్, అభివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరంభ్ టౌన్‌షిప్‌లో బుద్ధుడి విగ్రహ ఆవిష్కరణ





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** లింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ఆరంభ్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, అహింస, సమానత్వం, మానవతా విలువలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమైన మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. జీవితంలోని బాధలకు కారణాలను తెలుసుకుని వాటికి పరిష్కారం కనుగొనే క్రమంలో రాజభవనాన్ని విడిచి తపస్సు చేసిన బుద్ధుడు, అనేక సంవత్సరాల ధ్యానం అనంతరం జ్ఞానోదయం పొందారని పేర్కొన్నారు. మన కోరికలే బాధలకు మూలమని, మంచి ఆలోచనలు, సత్కార్యాల ద్వారా సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని బుద్ధని బోధనలు తెలియజేస్తాయని రవికుమార్ యాదవ్ అన్నారు. బుద్ధుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎల్లేష్, విజయలక్ష్మి, అజయ్, రమేష్, నరసింహ, శ్రీనివాస్, బసవయ్య, జ్యోతి, మీనమ్మ, లక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోహి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన భవనంలో పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం లేకుండా అందుబాటు ధరల్లో అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో స్కూల్‌ను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తూ, నాణ్యతతో కూడిన బోధన ద్వారా మంచి గుర్తింపు, పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ దినేష్ భరత్, రేఖ, విజయలక్ష్మి, అమీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్



**నల్గొండ ప్రతినిధి, జూన్ 17 (ది క్రైమ్ న్యూస్):** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరయ్యనగర్ (వీ.బి.నగర్)లో డయల్-112 విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది గృహహింస ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి పోలీసు సిబ్బందిపై దాడి చేసి విధి నిర్వహణకు ఆటంకం కలిగించిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక హోంగార్డుకు స్వల్ప గాయాలు కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం నిందితుడు లిలితురక రాంబాబు (32)ను 17-06-2026న అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా హాలియా పోలీసులు మాట్లాడుతూ, ప్రజలు పోలీసు సిబ్బంది విధి నిర్వహణకు సహకరించాలని, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు.

## "గో టు విలేజ్""కార్యక్రమం విద్యతోనే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది దండు వరలక్ష్మి మాదిగ

**ఘనంగా గ్రామ కమిటీ ఏర్పాటు :జెండా గద్దె నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన నేతలు**





**కరీంనగర్ టౌన్, జూన్ 17(ది క్రైమ్ న్యూస్ ):** మానకొండూర్ మండల గంగిపెల్లి, గట్టు దుద్దెనపల్లి, చెంజర్ల గ్రామంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం గంగిపెల్లి గ్రామంలో బుధవారం ఉదయం 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పౌలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగిపెల్లి, గట్టు దుద్దెనపల్లి, చెంజర్ల, నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎంఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ దండు వరలక్ష్మి మాదిగ హాజరై మాట్లాడారు. ప్రతి బిడ్డకు విద్యే పరమావధి కావాలని, చదువు ద్వారానే సమాజంలో ఉన్నత స్థానాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యతోనే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, విద్యా ప్రాధాన్యతను గుర్తించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో జెండా గద్దె నిర్మాణ స్థలాన్ని నాయకులు పరిశీలించారు. గంగిపెల్లిలో పౌలు ఆధ్వర్యంలో చేపట్టబోయే జెండా గద్దె నిర్మాణానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని దండు వరలక్ష్మి మాదిగ ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గ్రామ మహిళలు అనన్య, రజితలతో పాటు స్థానిక మహిళలు, యువకులు, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం తాగి దొరికితే జైలుకే

**- రామగుండం పరిధిలో ఒకరికి 3 రోజుల శిక్ష - వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రామగుండం ట్రాఫిక్ సీఐ పిలుపు**

**- నిబంధనలు పాటించకుండా రాంగ్ రూట్ లో వెళ్తే చట్టపరమైన చర్యలు**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మద్యం తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తికి కోర్టు 3 రోజుల జైలు శిక్ష విధించింది. రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఒక వ్యక్తిని గోదావరిఖని ప్రిన్సిపల్ కోర్టు మేజిస్ట్రేట్ వెంకట్ సచిన్ రెడ్డి ముందు హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ సదరు వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎవరూ కూడా మద్యం తాగి వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. రాంగ్ రూట్ లో ప్రయాణించడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటివి చేయకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

## ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ భూముల సెటిల్మెంట్ ల?

**- ప్రభుత్వ ఉద్యోగి సురేందర్‌పై చర్యలు తీసుకోవాలి**

**- కుక్క శ్రావణ్‌కుమార్, 26వార్డు కౌన్సిలర్ అభ్యర్థి**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగుతూ, మరోపక్క భూసెటిల్‌మెంట్స్ చేస్తున్నాడని ఈర్ల సురేందర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి పట్టణానికి చెందిన కుక్క శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు ఆయన కుటుంబ సభ్యులపై ఈర్ల సురేందర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తనకు కాలు విరిగింది అంటూ, మీడియా సాక్షిగా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను ప్రాధేయపడి, ఇప్పుడు అధికారం పోగానే తెలంగాణ తెచ్చినంటువంటి నాయకుడిపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. అలాగే ఈర్ల సురేందర్ ప్రభుత్వ ఉద్యోగిగా కమాన్‌పూర్ మార్కెట్‌లో విధులు నిర్వహించాల్సి ఉండగా, విధులకు హాజరు కాకుండా ఇతర కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు. ప్రజల పన్నులతో జీతం పొందుతూ ప్రభుత్వ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ డబ్బు, మద్యం పంపిణీ చేసిందని ఆరోపించారు. అలాగే ఈర్ల సురేందర్ ఎంపీటీసీగా పనిచేసిన కాలంలో 25,26వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పలువురి నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఈర్ల సురేందర్‌పై వచ్చిన ఆరోపణలను సమగ్రంగా విచారించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష - రైతులకు కొరత లేకుండా పకడ్బందీగా ఎరువుల సరఫరా - రెండు మూడు రోజుల్లో యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రస్తుత వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటికి జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా, అ.వ 4,12,511 యూరియా బస్తాలు నిల్వలో ఉండి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి వారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల విత్తనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు లేదా మూడు రోజుల్లో యాప్‌ను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కావున పెద్దపల్లి జిల్లా రైతులు అందరూ యూరియా బస్తాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట

## ● పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, ఇక్రిశాట్, ఫ్రెండ్స్ కాలనీ, ఇందిరానగర్, మంజీర పైప్‌లైన్ అంతర్గత రోడ్లు, సాయి మారుతి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, మాజీ కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా దీప్తిశ్రీనగర్, ఇక్రిశాట్ కాలనీలలో రూ.89 లక్షలతో, ఫ్రెండ్స్ కాలనీలో రూ.61 లక్షలతో, ఇందిరానగర్, మంజీర పైప్‌లైన్ అంతర్గత రోడ్లు, సాయి మారుతి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మియాపూర్‌లో రూ.1.88 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ షెల్టర్, జనప్రియ వెస్ట్ సిటీ, నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలలో రూ.1.88 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులకు పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బుధవారం శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం కాలనీల్లో రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజయ్ షెల్టర్ నుంచి మక్తా మహబూబ్ పెద్దకుడి చెరువు కల్వర్టు వరకు రూ.68 లక్షలతో సీసీ రోడ్డు, జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో రూ.54 లక్షలతో సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్, బొల్లారం మెయిన్ రోడ్డు నుంచి నాగార్జున ఎన్‌క్లేవ్ వరకు రూ.66 లక్షలతో కనెక్టివిటీ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: టీబీజీకేఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది

**● ఎండ వేడిమి దృష్ట్యా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కొనసాగించాలి ● ఇంచార్జి జిఎంకు టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి సాంబయ్య వినతిపత్రం అందజేత**



**రామగిరి, జూన్ 17(ది క్రైమ్ న్యూస్):-** కార్మికుల సమస్యలను గుండెల్లో పెట్టుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కార్మికులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ఆర్జీ-త్రీ, ఏపీఏ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆర్జీ-త్రీ, ఏపీఏ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ జూన్ నెల మధ్యలో వర్షాలు ఉన్నప్పటికీ, ఎండ తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ఉపరితల గనుల వద్ద కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆర్జీ-త్రీ, ఏపీఏ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో సెంట్రల్ ,డివిజన్ కమిటీ నాయకులు ఇంచార్జ్ జనరల్ మేనేజర్ రామ్మోహన్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఉపరితల గనుల వద్ద నేటికీ 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రత కొనసాగుతున్నదని జూన్ 15వ తేదీ వరకే మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారని వేడిని దృష్టిలో ఉంచుకొని కార్మికుల సంక్షేమం కోసం గతంలో ఎండ వేడిని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లను వాతావరణం చల్ల బడే వరకు ఇచ్చిన సందర్భాన్ని కొనసాగించేలా ప్రస్తుతం కూడా ఎండ తీవ్రత తగ్గేవరకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను ఉన్నతాధికారులతో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఇంచార్జ్ జిఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, దేవ శ్రీనివాస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈసంపల్లి రమేష్, రమ్య రెడ్డి, స్వామి, షరీఫ్, పాశం శ్రీనివాస్ రెడ్డి, పొన్నం సదయ్య,దాసరి మల్లేష్, జిటుకు శ్రీనివాస్ ,అల్లం తిరుపతి,పోతరాజు రవి, భాగం పూర్ణాకర్,నీలం సంపత్, బుద్దే ఉదయ్, బండి బాబురావు, బొట్ల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అతివేగంగా వాహనాలు నడపకూడదు

**గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ - ఎన్టీపీసీ మిలీనియం హాల్ లో అవగాహన సదస్సు**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** అతివేగంగా వాహనాలు నడపకూడదు అని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ తెలిపారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మరియు బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సును సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు, ఆదేశాలు చేశారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నైపుణ్యం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని, విద్యార్థులను ఎక్కించే సమయంలో, దించే సమయంలో నిర్దేశించిన ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని సూచించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డుపై ఓవర్‌టేకింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపడం లేదా సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు చేసే ఏ తప్పిదానికైనా సంబంధిత పాఠశాల లేదా కళాశాల యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్టీపీసీ ఎసఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎసఐ సంధ్యారాణి, రామగిరి ఎసఐ శ్రీనివాస్, ముత్తారం ఎసఐ రవికుమార్, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ పోక్సో కేసులో నిందితులకు శిక్ష..

## 20 ఏళ్ల జైలు శిక్ష విధించిన ప్రత్యేక న్యాయస్థానం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన పోక్సో కేసులో ఇద్దరు నిందితులను ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా తేల్చి కఠిన శిక్షలు విధించింది. రాజేంద్రనగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల విచారణకు సంబంధించిన ప్రత్యేక న్యాయమూర్తి టి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 2019 జూన్‌లో ఓ ప్రైవేట్ ప్రీ-స్కూల్‌లో చదువుతున్న మూడున్నరేళ్ల చిన్నారి పాఠశాలకు వెళ్లడానికి నిరాకరించడంతో పాటు అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో పాఠశాలలో జిమ్నాస్టిక్, కరాటే కోచ్‌గా పనిచేస్తున్న వ్యక్తి చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. అలాగే పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్‌పై కూడా కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ఇద్దరు నిందితులను 2019 జూలై 2న అరెస్టు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ప్రధాన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించగా, రెండో నిందితురాలికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. అదేవిధంగా బాధిత చిన్నారికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

# బదిలీపై వచ్చిన అధికారులకు టీబీజీకేఎస్ ఆత్మీయ సత్కారం

**- టీబీజీకేస్ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య నేతృత్వంలో**





**రామగిరి, జూన్ 17(ది క్రైమ్ న్యూస్):-** వివిధ డివిజన్ల నుండి బదిలీపై ప్రమోషన్ ద్వారా ఆర్జి-త్రీ డివిజన్లో బాధ్యతలు స్వీకరించిన పలువురు ఉన్నతాధికారులకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్వాగత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీజీకేస్ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య నేతృత్వంలో సెంట్రల్, డివిజన్ కమిటీ నాయకులు పాల్గొన్న ఇట్టి కార్యక్రమంలో ఏపిఏ ఏరియా ఇంజనీర్ దూప్ సింగ్, ఆర్జి-త్రీ ఏరియా ఇంజనీర్ ఉదయభాస్కర్, ఏరియా క్వాలిటీ ఇంచార్జ ఆసిఫ్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు వంశీధర్ ఆసిఫ్ ను వారి కార్యాలయాల్లో శాలువాలతో సత్కరించి పూల బొకేలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా సాంబయ్య తమ సంఘం నాయకులను పరిచయం చేశారు. డివిజన్లో బొగ్గు ఉత్పత్తికి, కార్మికుల సంక్షేమానికి అధికారులతో సమన్వయంతో పనిచేసేందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఎల్లప్పుడూ సహాయకారిగా ఉంటుందని పేర్కొనగా పరస్పర సహకారం తప్పనిసరని అధికారులు తెలియజేస్తూ కార్మిక సమస్యలను తమ దృష్టికి తేవాలని వాటి పరిష్కారానికి తమ వంతు సహకారాన్ని పరిష్కారాన్ని, తప్పనిసరిగా త్వరితగతిన చేస్తామని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఓకే కుటుంబం ఒకే లక్ష్యం ఓకే గమ్యం స్ఫూర్తిగా సంస్థ పురోభివృద్ధికి ముందుకు సాగుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈసంపల్లి రమేష్, సెంట్రల్ డివిజన్ కమిటీ నాయకులు రమ్య రెడ్డి, స్వామి షరీఫ్, దేవ శ్రీనివాస్, పాశం శ్రీనివాస్ రెడ్డి, పొన్నం సదయ్య ,దాసరి మల్లేష్ ,జిటుకు శ్రీనివాస్, అల్లం తిరుపతి, పోతరాజు రవి, భాగం పూర్ణాకర్, నీలం సంపత్ ,బుద్దే ఉదయ్ ,బండి బాబురావు ,బొట్ల శివశంకర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బాలసదన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా సంక్షేమ అధికారి( ఇంచార్జ్) కాళిందిని**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో శ్రీ రామ టాకీస్ సమీపంలో నిర్వహిస్తున్న బాలసదన్ (చిల్డ్రెన్ హోమ్ ఫర్ గర్ల్స్) లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు (ఇంచార్జ్) జిల్లా సంక్షేమ అధికారి కాళిందిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అనాథలు, విడిచిపెట్టబడిన వారు , క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న 6 నుండి 18 సంవత్సరాల లోపు బాలికలు ప్రవేశానికి అర్హులని ఆయన పేర్కొన్నారు.అర్హత కలిగిన బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులు, సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 6300398362 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ప్రకటనలో తెలిపారు.

# ఎన్నికల్లో బిఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకం...

**మధిరలో బి ఎల్ ఏ ల శిక్షణ శిబిరం**





**మధిర ప్రతినిధి జూన్ 17 (ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలోని దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌ఏలకు శిక్షణ శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హాజరైన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఏల పాత్ర అత్యంత కీలకమని, ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, అభ్యంతరాల నమోదు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పని చేస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి బిఎల్‌ఏ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, జిల్లా నాయకులు కర్నాటి రామారావు, చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ కి ఎంపికైన పాఠశాల బోధకులకు నేడు ఇంటర్వ్యూలు

**ఎంఈఓ మురళీ మోహన్ రావు**

**మధిర ప్రతినిధి, జూన్ 17 (ది క్రైమ్ న్యూస్):** మధిర మండల స్థాయిలో ప్రీ ప్రైమరీ కి ఎంపికైన నాలుగు పాఠశాలలు బోధకులు మరియు ఆయా పోస్టులకు మండల స్థాయిలో ఈనెల 8 మరియు 9 తారీకుల్లో అప్లికేషన్స్ పెట్టుకున్న అభ్యర్థులందరికీ గురువారం19 శుక్రవారం ఇంటర్వ్యూ ఉంటుందని కావున అందరూ గురువారం ఉదయం 11 గంటల సమయానికి మధిర ఎండిఓ ఆఫీస్ మీటింగ్ హాలు వద్దకు హాజరుకావాలని మండల విద్యాశాఖాధికారి బుధవారం మురళీమోహన్ రావు పత్రికా ప్రకటన విడుదల చేసారు. కావున అభ్యర్థులందరూ సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

# మధిరలో రోడ్డు ప్రమాదం



**మధిర ప్రతినిధి, జూన్ 17 (ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలోని చెరువు కట్టపై బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అంబారుపేట గ్రామానికి చెందిన ఇద్దరూ యువకులు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి బాధితులను అంబులెన్స్ ద్వారా మధిరలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి, ప్రమాదానికి సంబంధించిన ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

# పలు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే





**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కాటారం మండలంలోని బొడ్డు రాజేశ్వరి - సుధాకర్ పుత్రిక రిషిత నూతన వస్త్రాలంకరణ మహోత్సవం లో మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధుకర్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు, అనంతం ఆదివారం పేట గ్రామంలో సూరం మల్లమ్మ, తోటపల్లి సమ్మిరెడ్డి లు ఇటివల మరణించగ వారి కుటుంబాలను పరామర్శించి మరియు ఓడిపిల వంచ గ్రామంలో వడ్లకొండ సమ్మయ్య, పురుషోత్తం మల్లమ్మ , వావిల్ల బానయ్య లు ఇటీవల మరణించగ వారి చిత్రపటాలకు పూలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాలను పరామర్శించారు, ఈ కార్యక్రమంలో ఆయన వెంట జోడు శ్రీనివాస్, వూర వెంకటేశ్వరరావు, కొండగొర్ల వెంకటస్వామి, ముల్కలపల్లి శ్రీలక్మి, నరివేద్ది శ్రీనివాస్, బొడ్డు రాజబాబు, కొండపర్తి రవి, రత్న రమేష్ రెడ్డి, దానం సమ్మయ్య, ముంత బాపు, దుర్గం రాజేష్, అతుకూరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యా అవకాశాలపై చర్చ

**- చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక సమావేశం**





**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్ డమ్‌లోని ప్రతిష్టాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం మరియు చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించారు. రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి విద్యను అందిపుచ్చుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో పోటీపడేలా భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు తమ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల గురించి వివరించారు. తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య, గ్లోబల్ ఎక్స్‌పోజర్ కల్పించేందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధి ఒలివియా మెక్‌లాగ్లిన్, సంబంధిత శాఖల అధికారులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడి వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి, జూన్ 17, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ బడి వెబ్‌సైట్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్ర విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల సౌకర్యార్థం డిజిటల్ విద్యా విధానాన్ని ప్రోత్సహించే దిశగా రూపొందించిన "తెలంగాణ బడి" విద్యా వెబ్‌సైట్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సరికొత్త డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ప్రముఖ తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ గొల్లపెల్లి గణేష్ స్వయంగా తీర్చిదిద్దారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన డిజిటల్ పాఠాలు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పేపర్లు, ఇంటరాక్టివ్ క్విజ్‌లు, మరియు వ్యాకరణ అంశాలను విద్యార్థులకు సులభంగా, ఉచితంగా అందుబాటులో ఉంచడమే ఈ వెబ్‌సైట్ ప్రధాన ఉద్దేశం అని వారు పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అంది పుచ్చుకుంటూ, తెలుగు భాషా బోధనలో డాక్టర్ గొల్లపెల్లి గణేష్ చేస్తున్న ఈ విశేష కృషిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులపై నిరంతరం కృషి చేస్తున్నాం...

**- నాణ్యతలో రాజీ పడకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశం..**
**- అయోధ్య నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు పర్యవేక్షించిన**
**- మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్..**



**బోడుప్పల్:(ది క్రైమ్ న్యూస్):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అయోధ్య నగర్ కాలనీలో నూతన సీసీ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ స్థానిక నేతలతో కలిసి సిసి రోడ్డు పనులను పర్యవేక్షించారు.నాణ్యతలో రాజీ పడకుండా త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్ ను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని,కొత్త కిషోర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పడతం లోకేష్,అయోధ్య నగర్ కాలనీ అధ్యక్షుడు జేనిగ ఆంజనేయులు,ఉపాధ్యక్షులు సిహెచ్ మురళీధర్,ప్రధాన కార్యదర్శి యానంల మారుతి,సెక్రటరీ వి పూర్ణచంద్రరావు, కోశాధికారి ఎరుకల సురేష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి

**టీజీ20 ఆరంభ వేడుకల ఆహ్వాన పత్రిక అందజేత**



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి మన్నె జీవన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 21న నుంచి చారిత్రక టీజీ20 లీగ్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఆరంభ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి ఆహ్వానించారు. టీజీ20 టోర్నమెంట్, ఫ్రాంచైజీలు, పోటీపడుతున్న క్రీడాకారులు, జిల్లా క్రికెటర్ల ప్రాతినిధ్యం వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించిన జీవన్‌రెడ్డి లీగ్ ఆరంభ వేడుకల ఆహ్వాన పత్రికను ఆయనకు అందించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనీబాలా దేవి, హెచ్‌సీఏ కోశాధికారి అనిల్ కుమార్, అపెక్స్ కౌన్సిల్ కౌన్సిలర్ సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

# ప్రతి ఉపాధి కూలి ఈ.కే.వై.సీ తప్పనిసరిగా చేయించుకోవాలి

**- సర్పంచ్ పల్లె ప్రతిమ- పీవీ రావు**



**రామగిరి, జూన్ 17(ది క్రైమ్ న్యూస్):-** ప్రతి ఉపాధి కూలీ ఈ.కే.వై.సీ తప్పనిసరిగా చేయించుకోవాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు కోరారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఉపాధి కూలీల ఈ.కే.వై.సీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రత్నాపూర్ లో 601 జాబ్ కార్డ్స్ ఉన్నాయని, 992 మంది కూలీలు ఉన్నారని ఆమె తెలిపారు. 445 జాబ్ కార్డ్స్ లో కూలీలు యాక్టివ్ గా ఉన్నారన్నారు. 38 మందికి నూతనంగా జాబ్ కార్డ్స్ వచ్చాయని అన్నారు. గ్రామంలో 97 మంది ఇందిరమ్మ గృహ నిర్మాణం చేసుకుంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణం చేసుకునే వారందరూ 90 రోజుల ఉపాధి ఎన్.ఎం.ఎం.ఎస్ మస్టర్ పడాలని అప్పుడే రూ. 27,600/- డబ్బులు వారి అకౌంట్ లో పడతాయని తెలిపారు. 2025-26 లో వంద మస్టర్లు 62 మంది సాధించారని తెలిపారు. నూతనంగా జాబ్ కార్డులు కావలసినవారు తమ ఆధార్ కార్డు, ఎస్బిఐ/ యూనియన్ బ్యాంక్/ పోస్టల్ అకౌంట్ (ఏదైనా ఒకటి), రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, అప్లికేషన్ ఫామ్ తో గ్రామపంచాయతీలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి ఇందిరమ్మ గృహాలకు వెళ్లే లబ్ధిదారులకు ఎన్ .ఎం.ఎం.ఎస్ లో మస్టర్ లను సర్పంచ్ ప్రతిమ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఇంచార్జ్ ఏ.పీ.ఓ వరికోల్ల మౌనిక, టెక్నికల్ అసిస్టెంట్లు మల్కా.అఖిల, సెక్రటరీ గంగుల సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.బి.ఆర్ కాలనీ అధ్యక్షుడుగా సత్యంధర్ ముదిరాజ్ ఏకగ్రీవం

**- నూతన కమిటీని సన్మానించిన వజ్రేష్ యాదవ్, అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్ : కాలనీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచన**



**బోడుప్పల్:(ది క్రైమ్ న్యూస్):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఎస్.బి.ఆర్ కాలనీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సత్యంధర్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్యంధర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్,మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ లను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ఎస్.బి.ఆర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి కోసం అందరూ కలిసిమెలిసి కృషి చేయాలని నేతలు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్,కోశాధికారి ఎం శ్రీకాంత్,కాలనీ కమిటీ మెంబర్లు కృపాకర్ ఉపేందర్,బాల్ రెడ్డి,చైతన్య శ్రీకాంత్,తిరుపతి రెడ్డి,అరవింద్,సతీష్,త్రిపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ నూతన ఉపాధ్యక్షుడిగా బుద్దారి బుచ్చన్న నియామకం



**రామగిరి, జూన్ 17(ది క్రైమ్ న్యూస్):-** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ 2026-27 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని నియమించింది. ఇందులో భాగంగా క్లబ్ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ సామాజిక సేవకుడు లయన్ బుద్దారి బుచ్చన్న నియమితులయ్యారు.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, నాయకులు మాట్లాడుతూ బుచ్చన్న సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు, యువత అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన బుచ్చన్న మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన క్లబ్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ ప్రతిష్టను మరింత పెంపొందించేలా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ నియామకాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

# ఉప్పల్ బిల్డర్స్ సర్వసభ్య సమావేశం

**- నిర్మాణరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ**
**- సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి**





**బోడుప్పల్ (ది క్రైమ్ న్యూస్):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌లో ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి సామ సతీష్ రెడ్డి సమన్వయంతో నిర్వహించిన ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో బిల్డర్స్ పాల్గొన్నారు.ఈ సమావేశానికి తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సి.ప్రభాకర్ రావు,ముఖ్య సలహాదారులుగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,ఉపాధ్యక్షుడు జేపీ విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నిర్మాణ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సెంట్రింగ్, మేస్త్రి కార్మికుల సమ్మె ప్రభావం,టీజీఎస్పీడీసీఎల్ శాఖ నుంచి బిల్డర్లకు ఎదురవుతున్న వివిధ ఇబ్బందులు, అలాగే ఇటీవల ప్రభుత్వం పట్టా భూములు, రిజిస్టర్డ్ ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చిన అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.ఈ సందర్భంగా బిల్డర్స్ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించామని అన్నారు.

# 'టీజీ20 లీగ్' వివాదంలో విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లకు లీగల్ నోటీసులు


**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' చుట్టూ ఇప్పుడు ఊహించని లీగల్ ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరోలు వెంకటేష్, విజయ్ దేవరకొండలతో పాటు పలువురు స్టార్ క్రికెటర్లకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ లీగల్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు స్పోర్ట్స్ అండ్ సినీ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హెచ్‌సీఏ ఈ టీజీ20 లీగ్‌ను అక్రమంగా నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ స్పష్టం చేసింది. బోర్డు పర్మిషన్ లేని లీగ్‌ను సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం చట్టప్రకారం తప్పని వేలెత్తి చూపింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ లీగ్ పేరు వాడుకుంటూ కార్పొరేట్ కంపెనీలతో హెచ్‌సీఏ రూ. వందల కోట్ల బిజినెస్ చేస్తోందని టీసీఏ మండిపడింది. ఇది కేవలం యువ క్రికెటర్లను, స్పాన్సర్లను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించింది. ఈ అక్రమ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారంటూ సినీ ప్రముఖులు విజయ్ దేవరకొండ, విక్టరీ వెంకటేష్‌తో పాటు క్రికెట్ స్టార్స్ మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ, అంబటి రాయుడుకు నోటీసులు జారీ చేసింది. బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేస్తూ సాగుతున్న ఈ లీగ్ ప్రమోషన్లపై సదరు ప్రముఖులు వెంటనే పునరాలోచన చేయాలని.. లేనిపక్షంలో చట్టపరంగా కఠినమైన న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ గట్టిగా హెచ్చరించింది.

# గంజి నీరు తాగితే ఘనమైన లాభాలు.. ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే వేస్ట్ చేయరు..!



గంజి నీరు అధిక బరువును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. మీరు బరువు తగ్గాలను కున్నప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. గంజి నీరు మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయ పడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి గంజి నీళ్లు తాగడం మేలు చేస్తుంది. గంజి నీళ్లలో ఎక్కువ మొత్తంలో అమినో యాసిడ్స్ ఉంటాయి. ఇది శరీరంలోని కండరాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గంజి నీటిలో బి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల మన శరీరానికి పోషణ లభిస్తుంది. విటమిన్ల లోపం రాకుండా చూసుకోవచ్చు. పిల్లలకు గంజి తాగిస్తే చాలా మంచిది. వారి ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. పసిపిల్లలు పాలు సరిగ్గా తాగకపోతే వారికి కనీసం గంజి నీటిని అయినా తాగించాలి. దాంతో వారికి కావల్సిన ఆహారం అంది శక్తి లభిస్తుంది. పోషణ సరిగ్గా ఉంటుంది. విరేచనాలు అయిన వారు గంజి నీటిని తాగితే వెంటనే విరేచనాలు తగ్గుతాయి. విటమిన్లు, ఇతర యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉన్న గంజి నీరు చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. గంజిలో అల్లాంటన్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు.. మొటిమలను నివారిస్తాయి. అలాగే ఎమినో యాసిడ్స్ ఉండటం వల్ల..రంధ్రాలను క్లెన్స్ చేసి.. చర్మాన్ని బిగుతుగా మార్చి, కాంప్లెక్షన్ ని పెంచుతుంది. గంజి నీళ్లతో మీ ముఖాన్ని కడుక్కోవడం వల్ల మూసుకుపోయిన రంధ్రాలు తెరుచుకోవడంతోపాటు మొటిమలు రాకుండా ఉంటాయి. ఇది ముఖంపై ఉన్న నల్ల మచ్చలను పోగొట్టి, చర్మం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. బియ్యం కడిగిన నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా తయారవుతుంది. అదేవిధంగా, గంజి నీరు జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కేశ సంరక్షణలో రైస్ వాటర్ ఉపయోగించేందుకు ఒక కప్పు గంజి నీటిలో 20 గ్రాముల మెంతులు అవసరం. రాత్రంతా గంజి నీటిలో మెంతులు నానబెట్టాలి. ఆ మర్నాడు ఉదయం మెంతులను వేరు చేసి గంజిని స్ప్రే బాటిల్ పోసుకుని జుట్టు మీద స్ప్రే చేసుకోవాలి. లేదంటే, ఆ గంజినీటిని మొత్తం తలకు పట్టేలా బాగా అప్లై చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత కడిగేయాలి. కేవలం గంజి నీటిని మాత్రమే తలకు అప్లై చేయడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది

# ఎండు కొబ్బరి ముక్క తింటే ఎన్ని లాభాలో తెలుసా..?




## నరాల సమస్యతో బాధపడే వారికి వరంలాంటిది..!

మన దేశంలో ఎండు కొబ్బరిని అందరి ఇళ్లలో వాడుతుంటారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా వాడుతుంటారు. ఇది తినడానికి చాలా రుచిగా కూడా ఉంటాయి. ఎండు కొబ్బరిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా, దాని వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ఎండుకొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి మూలకాలు ఉంటాయి. అంతే కాకుండా ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. కాబట్టి ఎండు కొబ్బరి వల్ల కలిగే లాభనష్టాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. రుచి కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు లభిస్తుండగా, ఏదైనా తీపి లేదా కూరగాయలలో ఎండు కొబ్బరిని కలుపుకుంటే, దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. ఇందులో ఉండే గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను కూడా సులభంగా తగ్గిస్తాయి. కాబట్టి తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఎండుకొబ్బరిని ఆహారంలో తీసుకోవాలి. ఎండు కొబ్బరి తినడం వల్ల మన మెదడుకు పదును పెట్టడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం వల్ల మన జుట్టుకు చాలా మేలు జరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన జుట్టు రాలడం ఆగిపోతుంది. క్రమంగా కొత్త జుట్టు పెరిగేలా చేస్తుంది. పైగా మీ కేశాలు నల్లటి రంగులో నిగనిగలాడుతుంది. అంతేకాదు.. ఎముకలకు కూడా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన ఎముకలకు బలం చేకూరడంతో పాటు వాటిలోని పగుళ్ల శబ్దం కూడా ఆగుతుంది. ఎండు కొబ్బరి తినడం తలనొప్పితో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తింటే మన శరీరానికి బలం చేకూరుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీని వల్ల రక్తం లేకపోవడం పోతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. దీని వల్ల మీరు ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్‌ను చాలా వరకు నివారించవచ్చు. ఎండిన కొబ్బరిని తీసుకోవడం గుండెకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎండు కొబ్బరిని రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే, ఎండు కొబ్బరి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగ్గా ఉంచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు కొబ్బరిని ఎక్కువ మోతాదులో తినకూడదు. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో చాలా పోషకాలు ఉంటాయి. అందువల్ల, మీరు దీనిని తీసుకుంటే, ఇది రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించవచ్చు. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. మీరు దానిని ఎక్కువగా తీసుకుంటే, వాంతులు, కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఎండిన కొబ్బరిని అధికంగా తీసుకోవడం మధుమేహ రోగులకు మంచికాదంటున్నారు. ఎందుకంటే కొబ్బరిలో చాలా చక్కెర ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి.



# కొవ్వే కదా అని లైట్ తీసుకోకండి.. తేడా కొడితే మీ పని అంతేనట.. బీకేర్‌ఫుల్..



కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు ప్రతీ ఇంట్లో కూడా పట్టిపీడిస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణం.. బయటి ఆహారం ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత చెడ్డ కొలెస్ట్రాల్ ఉంటుంది. ప్రతీరోజూ వ్యాయామం చేయకపోతే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అయితే, మీ జీవక్రియ బాగా ఉంటే, కొలెస్ట్రాల్ స్థాయిల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగితే ప్రమాదం కొనితెచ్చున్నట్లే.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. దీని వల్ల రక్తనాళాలు ఇరుకుగా మారి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తపోటు, గుండె జబ్బులు ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలు ఏ సమయంలోనైనా గుండె సమస్యలకు దారితీస్తుంది. కానీ చాలా తక్కువ మందికి అధిక కొలెస్ట్రాల్, దాని ప్రభావాల గురించి తెలుసు.. అందుకే గుండెపోటు, పక్షవాతం లాంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు: కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కొంచెం గట్టిగా నడిచినా, మెట్లు ఎక్కినా ఊపిరి పీల్చుకునేందుకు ఆయాసంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. కళ్ల కింద ఉబ్బడం కొలెస్ట్రాల్ లక్షణం. కొన్నిసార్లు పసుపు రంగు మచ్చల్లాంటివి కళ్ళపై కనిపిస్తాయి. ఇది హై కొలెస్ట్రాల్ లక్షణం కూడా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే శరీరంలో రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒక్కసారిగా నరాలు మొద్దుబారిపోతాయి. ఆ సమయంలో కాళ్లకు చలనం కూడా అనిపించదు.. ఛాతీ నొప్పి, ఛాతీలో ఒత్తిడి, అసౌకర్యం కొలెస్ట్రాల్ పెరిగిన లక్షణాలు. ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీనివల్ల గుండె జబ్బులు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ వల్ల కూడా అధిక రక్తపోటు రావచ్చు. అధిక రక్త కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనులపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా, రక్త ప్రసరణ చెదిరిపోతుంది.. రక్తపోటు పెరుగుతుంది. కొలెస్ట్రాల్ వల్ల దృష్టి మసకబారుతుంది. కళ్లు దెబ్బతింటాయి. అందుకే.. ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకునే మార్గాలు.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తినడం, మద్యం త్రాగటం నియంత్రించాలి. వీధి ఆహారాన్ని తరచుగా తినవద్దు. నూనె, కొవ్వు రహిత ఆహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు, ధాన్యాలు, గింజలు, పండ్లు, చేపలు మొదలైన వాటిని ఎక్కువగా తినండి. తినడం, త్రాగడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. తగినంత నిద్ర పొందండి, ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి 3 నెలలకు రక్త పరీక్ష చేయడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేయండి. ఇవన్నీ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి..

# ఇంత చిన్న వెల్లుల్లి ఏం చేస్తుందనుకుంటే పొరపాటే..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే..

## ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!!

అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఆహార పదార్థాలలో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లిలో విటమిన్లు సి, కె, ఫోలేట్, మాంగనీస్, సెలీనియం, ఫైబర్, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, పొటాషియం వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసాన్ని ఉదయాన్నే పరగడుపున తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగితే ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వెల్లుల్లి రసం తాగడం వల్ల పొట్టలోని ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ దీనికి సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ తో బాధపడేవారు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ సమయంలో వెల్లుల్లి రసం తాగాలి. ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడి టాక్సిన్స్ ను బయటకు పంపిస్తుంది. వెల్లుల్లి రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. రోజూ వెల్లుల్లి రసం తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వెల్లుల్లి శ్వాసకోశసమస్యలనుండికూడాఉపశమనంకలిగిస్తుంది.వెల్లుల్లిలోఉండే యాంటీబ్యాక్టీరియల్ భాగాలు దీనికి సహాయపడతాయి. ఉదయాన్నే వెల్లుల్లి రసాన్ని తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు దూరం అవుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. వెల్లుల్లి కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కాలేయం, మూత్రపిండాలు, రక్తప్రవాహానికి అద్భుతమై డిటాక్స్ ఫైయర్ గా పనిచేస్తుంది. మెదడు పనితీరును రక్షిస్తుంది. జ్ఞాపకశక్తి, దృష్టి మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లిని తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గడానికి వెల్లుల్లి రసాన్ని కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. శరీరంలోని అనవసరమైన క్యాలరీలను కరిగించడంలో ఇవి మేలు చేస్తాయి. వెల్లుల్లి రసం బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. చర్మ ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి తోడ్పడుతుంది. మొటిమలను, మంటను తగ్గిస్తుంది.



# ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

# ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..! రోజూ తింటే రోగాలు మాయం.. మెరిసే, అందమైన చర్మం మీ సొంతం..!!



జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

# మధుమేహుల ఆరోగ్యంపై సబ్జా గింజల మ్యాజిక్..లాభాలు మామూలుగా లేవుగా!!

జీవనశైలి సరిగ్గా లేకపోతే, శరీరంలో అనేక వ్యాధులు రావడం ప్రారంభమవుతాయి. అలసట, అనారోగ్యం ఒక వ్యక్తిని ఒత్తిడికి గురి చేస్తుంది. చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధుమేహం రావడం సర్వసాధారణం. నీరు, ఫైబర్ లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో తెలుసుకుందాం.. మధుమేహం నయం కాదు. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. సబ్జా విత్తనాల్లో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని మీరు తాగే నీళ్లలో నానబెట్టుకుని తాగటం ఉత్తమం. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి.

స్పోర్ట్స్

# అల్జీరియాపై మెస్సీ హాట్రిక్ గోల్స్



ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సి తన సుదీర్ఘ కెరీర్‌లో మరో అద్భుతమైన చాప్టర్ యాడ్ చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను లీడ్ చేస్తూ అల్జీరియాపై 3-0 తేడాతో ఘనవిజయం సాధించడంలో మెస్సి కీ రోల్ ప్లే చేశాడు. 38 ఏళ్ల వయసులో మెస్సి వరల్డ్ కప్ హిస్టరీలోనే ఫస్ట్ ఎవర్ హాట్రిక్ గోల్స్ సాధించి రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్ లో ఫస్ట్ హాఫ్ లో ఒక గోల్ కొట్టిన మెస్సి, సెకండ్ హాఫ్ స్టార్ట్ అయిన కొద్దిసేపటికే సింపుల్ టాప్-ఇన్ తో రెండో గోల్ చేశాడు. ఆ తర్వాత 76వ నిమిషంలో తన ట్రేడ్‌మార్క్ స్టైల్లో మూడో గోల్ పూర్తి చేసి హాట్రిక్ నమోదు చేశాడు. దీంతో ఆరోహెడ్ స్టేడియంలో ఉన్న వేలాది మంది అర్జెంటీనా ఫ్యాన్స్ సంబరాల్లో మునిగిపోయారు. మెస్సి కెరీర్‌లో ఇది 61వ హాట్రిక్ కాగా అర్జెంటీనా తరఫున 11వ హాట్రిక్ కావడం విశేషం. ఈ ట్రెబుల్ తో వరల్డ్ కప్‌లో వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గోల్స్ చేసిన ప్లేయర్‌గా మెస్సి నిలిచాడు. ఈ మ్యాజికల్ ఈవెనింగ్ మెస్సి లైఫ్ లో చాలా స్పెషల్ గా నిలిచిపోతుంది. మెస్సి 2006 లో జర్మనీ వేదికగా సెర్బియా, మోంటెనెగ్రోపై వరల్డ్ కప్ డెబ్యూ మ్యాచ్ ఆడి గోల్ కొట్టాడు. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత అదే రోజున ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. అర్జెంటీనా తరఫున 200వ అప్పీయరెన్స్ ఇచ్చిన ఈ ఎనిమిది సార్లు బ్యాలన్ డి ఓర్ విన్నర్, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తర్వాత ఐదు వేర్వేరు వరల్డ్ కప్ ఎడిషన్లలో గోల్స్ చేసిన సెకండ్ ప్లేయర్‌గా రికార్డుకెక్కాడు. ఈ హాట్రిక్ తో మెస్సి వరల్డ్ కప్ టోటల్ గోల్స్ సంఖ్య 16కు చేరింది. జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ చాలా కాలంగా మెయింటైన్ చేస్తున్న ఆల్ టైమ్ గోల్ స్కోరింగ్ (16 గోల్స్) రికార్డును మెస్సి సమం చేశాడు. అర్జెంటీనా డిఫెన్స్ టైటిల్ రేసులో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో మెస్సి ఈ రికార్డును బ్రేక్ చేయడం చాలా ఈజీ అని అనిపిస్తోంది. మెస్సి సృష్టించిన విధ్వంసం వల్ల ఇతర ఫుట్‌బాల్ స్టార్స్ చేసిన అద్భుతాలు మరుగునపడిపోయాయి. ఫ్రాన్స్ ఫార్వర్డ్ ప్లేయర్ కిలియన్ ఎంబాపె సైతం సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసి తన టీమ్‌ను 3-1 తో గెలిపించాడు. ఎంబాపె వరల్డ్ కప్‌లో తన టోటల్ గోల్స్ సంఖ్యను 14కు చేర్చి వెస్ట్ జర్మనీ గ్రేట్ గెరార్డ్ ముల్లర్ సరసన ఫోర్త్ ప్లేస్ లో నిలిచాడు. ఇటు నార్వే స్టార్ ఎర్లింగ్ హాలాండ్ కూడా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టి తన టీమ్‌కు 4-1 తో బిగ్ విక్టరీ అందించాడు. కానీ ఆ నైట్ మాత్రం కంప్లీట్‌గా అర్జెంటీనా ఐకాన్ మెస్సినే తన మాయతో హైజాక్ చేశాడు. అర్జెంటీనా టీమ్ కాన్సాస్ సిటీకి వచ్చినప్పటి నుంచి అక్కడ 'మెస్సి మేనియా' పీక్స్‌కు చేరింది. ఆరోహెడ్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నీ మెస్సి ఫ్యాన్స్‌తో కిక్కిరిసిపోయాయి. ఐకానిక్ నంబర్ 10 జెర్సీలు వేసుకున్న వేలాది మంది ఫ్యాన్స్ నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ కు హోమ్ గ్రౌండ్ అయిన ఈ స్టేడియాన్ని బ్లూ అండ్ వైట్ కలర్‌తో నింపేశారు. రోసారియో నుంచి వచ్చిన తమ హీరోను పొగుడుతూ పాటలు పాడుతూ స్టేడియంలో హోరెత్తించారు. అమెరికాలో మెస్సి క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో ఈ మ్యాచ్ ప్రజెంటేషన్ స్పష్టం చేసింది.

## సెనెగల్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ దశలో భాగంగా న్యూజెర్సీ వేదికగా జరిగిన పోరులో ఫ్రాన్స్ 3-1 తేడాతో సెనెగల్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రెండు అద్భుతమైన గోల్స్‌తో మెరిసిన ఎంబాపె, జట్టును గెలిపించడమే కాకుండా ఫుట్‌బాల్ దిగ్గజాల రికార్డులను తిరగరాస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఫస్టాఫ్‌లో సెనెగల్ జట్టు ఫ్రాన్స్‌కు గట్టి సవాలు విసిరింది. కానీ, సెకండాఫ్‌లో ఎంబాపె వ్యూహంతో ఫ్రాన్స్‌ను విజయం వరించింది. సెనెగల్ జట్టు చాలా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపెను కట్టడి చేయడమే లక్ష్యంగా ఆడింది. ఫలితంగా ఫస్టాఫ్ ముగిసేసరికి ఎంబాపె కేవలం 14 సార్లు మాత్రమే బంతిని తాకగలిగాడు. దీనితో మొదటి 45 నిమిషాల ఆట ఒక గోల్ నమోదు కాకుండానే ముగిసింది. ఇక సెకండాఫ్‌లో ఫ్రాన్స్ జట్టు పక్కా వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టింది. ఎంబాపె ఒక్కసారిగా తన వేగాన్ని పెంచాడు. 66వ నిమిషంలో జూల్స్ కౌండే నుంచి అందిన ఒక అద్భుతమైన త్రూ-బాల్‌ను ఎంబాపె ఆధీనంలోకి తీసుకున్నాడు. అంతవరకు పెనాల్టీ బాక్స్‌లో బంతిని నియంత్రించడానికి ఇబ్బంది పడిన ఎంబాపె ఈసారి మాత్రం ఎలాంటి పొరపాటు చేయలేదు. అత్యంత చాకచక్యంగా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. తొలి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. కొద్దిసేపటికే బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ సాధించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు చేరింది. మ్యాచ్ దాదాపు ముగింపునకు వచ్చేసింది అనుకుంటున్న తరుణంలో, ఇంజూరీ టైమ్‌లో సెనెగల్ ప్లేయర్ గోల్‌గా మలిచాడు. దీంతో స్కోరు 2-1 గా మారి మ్యాచ్‌లో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. దీంతో ఆ మ్యాచ్ డ్రా అవుతుందేమోనన్న ఆందోళనలో ఫ్రాన్స్ అభిమానులు ఉన్నారు. అయితే సెనెగల్ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. ఫ్రాన్స్ ఎదురుదాడికి దిగింది. ఎంబాపె కొట్టిన లాంగ్-రేంజ్ షాట్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సాధించిన రెండు గోల్స్ ద్వారా కిలియన్ ఎంబాపే ప్రపంచకప్ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను అధిగమించాడు. ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ఇప్పటివరకు ఒలివియర్ గిరౌడ్ పేరిట ఉన్న రికార్డును ఎంబాపె బద్దలు కొట్టాడు. గిరౌడ్ 137 మ్యాచ్‌ల్లో 57 గోల్స్ సాధించగా, ఎంబాపే కేవలం 99 మ్యాచ్‌ల్లోనే 58 గోల్స్ మార్కును అందుకొని ఫ్రాన్స్ ఆల్-టైమ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఎంబాపె ప్రపంచకప్‌లలో 12 గోల్స్‌తో బ్రెజిల్ లెజెండ్ పెలే సరసన ఉన్నాడు. కానీ ఈ మ్యాచులో చేసిన రెండు గోల్స్‌తో పెలేను, అలాగే అర్జెంటీనా స్టార్ లీనల్ మెస్సీని వరల్డ్ కప్ ఆల్-టైమ్ స్కోరింగ్ చార్ట్‌లో వెనక్కి నెట్టేశాడు. ప్రపంచకప్ టోర్నమెంట్లలో ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన దిగ్గజ ఆటగాడు జస్ట్ ఫాంటైన్ రికార్డును సైతం అధిగమిస్తూ, ఎంబాపే తన ఖాతాలో 14 వరల్డ్ కప్ గోల్స్ వేసుకున్నాడు. ఈ ఘనతతో అతను ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన జర్మనీ ఆటగాడు మిరోస్లావ్ క్లోజ్ (16 గోల్స్) ఆల్-టైమ్ రికార్డుకు కేవలం రెండు గోల్స్ దూరంలో నిలిచాడు. సెనెగల్‌పై విజయం తర్వాత ఆ జట్టు కెప్టెన్, స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచకప్ లాంటి సుదీర్ఘ ప్రయాణానికి తమ జట్టు పూర్తిగా సిద్ధంగా ఉందని ప్రకటించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఎంబాపె తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టాడు. "టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించడం ఎప్పుడూ చాలా ముఖ్యం. మా ముందున్న మార్గం చాలా పెద్దది.



# థర్డ్ అంపైర్ వివాదస్పద నిర్ణయం

ఇండియా ఏ, అఫ్గానిస్తాన్ ఏ జట్ల మధ్య జరిగిన ఐదో ట్రై-సిరీస్ వన్డే మ్యాచ్ ఒక బిగ్ కాంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. టీమిండియా యంగ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అవుట్ విషయంలో థర్డ్ అంపైర్ ఇచ్చిన ఒక డెసిషన్ గ్రౌండ్‌లోనే కాకుండా సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపింది. అఫ్గాన్ ప్లేయర్ పట్టిన క్యాచ్ క్లియర్‌గా ఉన్నట్లు రిప్లైస్ లో కనిపించినా, థర్డ్ అంపైర్ మాత్రం బ్యాటర్‌కు ఫేవర్ గా నిర్ణయం తీసుకున్నాడు. బాల్ గ్రౌండ్‌కు తగిలిందనే సాకుతో నాటౌట్ అని ప్రకటించడంతో అఫ్గాన్ టీమ్ షాక్‌కు గురైంది. ఈ ఇన్సిడెంట్ జరిగినప్పుడు వైభవ్ సూర్యవంశీ ఇంకా పరుగుల ఖాతా కూడా తెరవలేదు. అఫ్గాన్ ఫీల్డర్ క్యాచ్ అందుకోవడంతో తను అవుట్ అయ్యానని ఫిక్స్ అయిన వైభవ్, అప్పటికే పిచ్ వదిలి బౌండరీ లైన్ వరకు వెళ్లాడు. కానీ జెయింట్ స్క్రీన్ పై థర్డ్ అంపైర్ గ్రీన్ లైట్ (నాటౌట్) ఫ్లాష్ చేయడంతో మళ్లీ క్రీజులోకి వెనక్కి వచ్చాడు. బాల్ కొంత భాగం నేలకు తగిలిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని అంపైర్ చెప్పాడు. ఈ విచిత్రమైన డెసిషన్ చూసి మైండ్ బ్లాక్ అయిన అఫ్గానిస్తాన్ ఏ ప్లేయర్స్ ఆన్-ఫీల్డ్ అంపైర్ల దగ్గరకు వెళ్లి గట్టిగా ఆర్గ్యూ చేశారు. థర్డ్ అంపైర్ అసెస్‌మెంట్ అస్సలు ఫెయిర్‌గా లేదంటూ నెటిజన్లు సైతం సోషల్ మీడియాలో అంపైరింగ్ ప్రమాణాలపై ట్రోల్స్ స్టార్ట్ చేశారు. ఐపీఎల్ 2026 లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 రన్స్ చేసి ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ 15 ఏళ్ల వండర్ కిడ్, లంక టూర్‌లో మాత్రం దారుణంగా తడబడుతున్నాడు. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో థర్డ్ అంపైర్ పుణ్యమా అని ఒక లైఫ్ లైన్ దక్కినా దాన్ని వైభవ్ సరిగ్గా యూజ్ చేసుకోలేకపోయాడు. టోటల్ గా రెండు సార్లు బతికిపోయిన ఈ యంగ్ బ్యాటర్, కేవలం 38 రన్స్ మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఫరీదూన్ దావూద్‌జాయ్ వేసిన బాల్‌ను మిస్‌హిట్ చేసి కవర్ పాయింట్ లో ఉన్న ఖాలిద్ తనివాల్‌కు సింపుల్ క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. ఐపీఎల్ లో వరల్డ్ బెస్ట్ బౌలర్లను ఊచకోత కోయడంతో వైభవ్ పై ఫ్యాన్స్ పెట్టుకున్న ఎక్స్‌పెక్టేషన్స్ నెక్స్ట్ లెవెల్ లో ఉన్నాయి. కానీ టి20 నుంచి వన్డే ఫార్మాట్ కు మారే క్రమంలో తను తీవ్ర ఒత్తిడిని ఫేస్ చేస్తున్నాడు. పైగా శ్రీలంక ఏ టీమ్‌తో జరిగిన లాస్ట్ మ్యాచ్ లో కాంట్రవర్షియల్ సూపర్ ఓవర్ ముగిసిన తర్వాత లంక ప్లేయర్ తో వైభవ్ ఫిజికల్ అల్టికేషన్ (భౌతిక గొడవ) కు దిగాడు. ఆ మ్యాచ్ లో ఇండియా ఏ టీమ్ ఓడిపోగా, వైభవ్ ప్రవర్తనపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ అఫ్గాన్ మ్యాచ్ లో అంపైర్ నిర్ణయంతో వైభవ్ వార్తల్లో నిలిచాడు. ఈ సిరీస్ లో వైభవ్ తన టాలెంట్ కు తగ్గట్లు ఆడలేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను కూడా టెన్షన్ పెడుతోంది.

# సెంచరీతో ఇషాన్ కిషన్ అరుదైన ఘనత!

టీమిండియా యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనతను సాధించాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 1000 పరుగుల మైలురాయి అందుకున్న ఆరో భారత బ్యాటర్‌గా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో బుధవారం లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో సెంచరీ చేయడం ద్వారా ఇషాన్ కిషన్ ఈ ఫీట్ సాధించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి అద్వితీయమైన బ్యాటింగ్ చేసిన ఇషాన్ కిషన్ 71 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇషాన్ కిషన్‌కు ఇది రెండో వన్డే శతకం. 79 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 125 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగులు జోడించాడు. అయితే ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ తన 33వ పరుగుతో వన్డేల్లో 1000 పరుగుల మైలురాయి అందుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు అతను 28 మ్యాచ్‌ల్లో 967 పరుగులు చేశాడు. అయితే 966 బంతుల్లోనే ఇషాన్ కిషన్ 1000 పరుగులు చేయడం గమనార్హం. వన్డేల్లో అతి తక్కువ బంతుల్లో 1000 పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ కిషన్ ఆరో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్, కపిల్ దేవ్, శుభ్‌మన్ గిల్, ఎంఎస్ ధోనీ ఇషాన్ కిషన్ కంటే ముందు వరుసలో ఉన్నారు. ఇషాన్ కిషన్‌తో పాటు శుభ్‌మన్ గిల్ కూడా శతకంతో చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో భారత్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది. వన్డేల్లో అఫ్గానిస్థాన్‌పై అత్యంత వేగంగా సెంచరీ నమోదు చేసిన మూడో బ్యాటర్‌గా కూడా ఇషాన్ కిషన్ నిలిచాడు. ఇయాన్ మోర్గాన్, రోహిత్ శర్మ మాత్రమే ఈ జాబితాలో ఇషాన్ కిషన్ కంటే ముందున్నాడు.





# అఫ్ఘాన్‌పై భారత్ భారీ స్కోరు..!

అఫ్ఘానిస్థాన్‌తో లక్నోలో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154), ఇషాన్ కిషన్ అద్భుత సెంచరీలతో కదంతొక్కడంతో టీమిండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు సాధించింది. రోహిత్ శర్మ 48 పరుగులతో రాణించగా, యశస్వి జైస్వాల్ (4) నిరాశపరిచాడు. ఇషాన్ కిషన్ ఆఖరిలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసి సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అఫ్ఘాన్ బౌలర్లలో నంగియాలై కరోటే 4 వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ భారీ స్కోరు చేసింది. లక్నో వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘానిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో టీమిండియా ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ సెంచరీలతో భారత్.. భారీ స్కోరు చేసింది. 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌట్ అయింది. రోహిత్ శర్మ 39 బంతుల్లో 48 రన్స్ చేసి సత్తాచాటాడు. రెగ్యులర్‌గా ఓపెనింగ్ స్థానంలో వచ్చే శుభ్‌మన్ గిల్.. తన ప్లేసును యశస్వి జైశ్వాల్‌కు త్యాగం చేశాడు. అయితే జైశ్వాల్ మాత్రం తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 9 బంతుల్లో 4 రన్స్ మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. వన్‌డౌన్‌లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన అతడు.. ఇవాళ్టి మ్యాచ్‌లోనూ శతక్కొట్టి వరుసగా రెండో సెంచరీని నమోదు చేశాడు. 110 బంతుల్లో 154 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ (39 బంతుల్లో 48 రన్స్) క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. రోహిత్ ఔట్ అయ్యాక వచ్చిన ఇషాన్ కిషన్.. మెరుపు బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. హాఫ్ సెంచరీ చేసేవరకు సుమారు 100 స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేసిన అతడు.. ఆ తర్వాత టీ20 క్రికెట్ తరహాలో రెచ్చిపోయాడు. ఏడా పెడా ఫోర్లు సిక్సర్లతో అదరగొట్టాడు. తొలి 52 బంతుల్లో 50 రన్స్ చేసిన ఇషాన్.. ఆ తర్వాత ఎదుర్కొన్న 27 బంతుల్లో ఏకంగా 75 పరుగులు రాబట్టాడు. దీంతో టీమిండియా భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. అయితే సెంచరీ హీరోలు ఇద్దరు చివర్లో ఔట్ కావడంతో స్కోరు బోర్డు కాస్త నెమ్మదించింది. చివరకు 49.5 ఓవర్లలో భారత్.. 402 పరుగులకు ఆలౌట్ అయింది. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో కరోటీ 4, రషీద్ ఖాన్ 3 వికెట్లు తీయగా.. ఘజన్‌ఫర్, సలీమ్ సఫీ ఒక్కో వికెట్ తీశారు. ప్రస్తుతం భారత్ సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి ఉంది.

## వైభవ్ సూర్యవంశీని జట్టు నుంచి తప్పించాల్సింది

మైదానంలో గొడవకు దిగిన టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందని మాజీ క్రికెటర్, వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. ఓ మ్యాచ్ ఆడినవ్వకుండా పక్కన పెట్టి అతనికి గుణపాఠం చెప్పాల్సిందని అభిప్రాయపడ్డాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక-ఏతో ఉత్కంఠగా జరిగిన గత మ్యాచ్‌లో భారత్-ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. సూపర్ ఓవర్ అనంతరం ఎగతాళి చేసిన శ్రీలంక ఆటగాడిని వైభవ్ సూర్యవంశీ నెట్టేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించిన సంజయ్ మంజ్రేకర్.. అఫ్గానిస్థాన్-ఏతో జరిగిన మ్యాచ్‌కు వైభవ్ సూర్యవంశీని పక్కన పెట్టాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'నేను గనుక భారత్-ఏ జట్టుకు కోచ్ లేదా మేనజర్‌గా ఉండి ఉంటే.. అఫ్గానిస్థాన్ ఏ జట్టుతో జరిగిన మ్యాచ్ నుంచి వైభవ్ సూర్యవంశీని కచ్చితంగా తొలగించేవాడిని. ఎంత రెచ్చగొట్టినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మైదానంలో భౌతికంగా గొడవపడటం ఆమోదయోగ్యం కాదు. 'అని సంజయ్ మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. శ్రీలంక ఆటగాడు విషెన్ హలంబకే హద్దులు ధాటాడని, శ్రీలంక విజయానంతరం ఇంటికి వెళ్లు.. ఇది ఐపీఎల్ కాదని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడని వార్తలు వచ్చినా.. వైభవ్ సూర్యవంశీ తీరును సంజయ్ మంజ్రేకర్ తప్పుబట్టాడు. అతను క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించాడని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ టీమిండియా పిలుపు కూడా అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. తద్వారా టీమిండియాకు ఎంపికైన అతి పిన్నవయస్కుడిగా సచిన్ టెండూల్కర్ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు.

# విశ్వజి



## పొడిజుట్టుకు ప్యాకప్!

ప్రస్తుతం చాలామంది 'హెయిర్ స్టయిలింగ్ టూల్స్'ను వాడుతున్నారు. జుట్టును స్ట్రెయిట్‌గా, కర్లీగా.. రకరకాలుగా మార్చేసుకుంటున్నారు. అయితే, ఇలా చేయడం వల్ల జుట్టు అందంగా కనిపించినా.. దీర్ఘకాలంలో సమస్యలు వస్తాయని సౌందర్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. హెయిర్ స్టయిలింగ్ టూల్స్ నుంచి వెలువడే అధిక వేడి వల్ల కుదుళ్లు, జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. వెంట్రుకల చివర్లు చిట్లిపోవడం, పొడిబారిపోవడం, తెగిపోవడం లాంటి సమస్యలు వస్తాయని అంటున్నారు. ఇలా దెబ్బతిన్న జుట్టుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలంటే.. కొన్ని చిట్కాలు పాటించాలని సూచిస్తున్నారు. పొడి జుట్టు సమస్యను పరిష్కరించడంలో పెరుగు, నూనె సమర్థంగా పనిచేస్తాయి. ఒక గిన్నెలో అరకప్పు పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనె, ఆరు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేసిన తర్వాత.. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు బాగా పట్టించాలి. ఆ తర్వాత నెత్తిని ప్లాస్టిక్ లేదా షవర్ క్యాప్‌తో కప్పి ఉంచాలి. 15-20 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే.. జుట్టు సున్నితంగా మారుతుంది. జుట్టురాలడం కూడా తగ్గుతుంది. పొడిబారిన జుట్టుకు మళ్లీ తేమను అందించడంలో కొబ్బరినూనె దివ్యౌషధమే! వెంట్రుకలు కుదుళ్ల నుంచి బలంగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ ఆర్గాన్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె తీసుకోవాలి. ఇందులో ఒక విటమిన్ ఇ క్యాప్సుల్, కొద్దిగా షియా బటర్ వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి.. గంట తర్వాత తక్కువ గాఢత కలిగిన షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే వేడివల్ల దెబ్బతిన్న జుట్టుకు తేమ అందుతుంది.

## చాట్ జీపీటీ స్టడీ మోడ్

ఉద్యోగులే కాదు.. విద్యార్థులు కూడా చాట్ జీపీటీ వాడేస్తున్నారు. హోంవర్క్ చేయాలన్నా, పరీక్షలకు సిద్ధం కావాలన్నా, కొత్త విషయాలు నేర్చుకోవాలన్నా చాలామంది దీన్నే ఆశ్రయిస్తున్నారు. అయితే, ఇది జవాబులు నేరుగా ఇవ్వడం వల్ల విద్యార్థులు సొంతంగా ఆలోచించడం తగ్గిపోతుందేమో అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఓపెన్ ఏఐ చాట్ జీపీటీలో ఒక వినూత్నమైన ఫీచర్‌ను తీసుకొచ్చింది. అదే 'స్టడీ మోడ్'. ఇది విద్యార్థులకు నేరుగా జవాబులు ఇవ్వదు. బదులుగా, ప్రశ్నల ద్వారా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ, విద్యార్థులు సొంతంగా ఆలోచించి, సమస్యను పరిష్కరించేలా గైడ్ చేస్తుంది. ఓపెన్ ఏఐ చెబుతున్న ప్రకారం.. విద్యార్థులు స్టడీ మోడ్‌తో కేవలం సూచనలు, సలహాలే అందుకుంటారు. అలా వారి అవగాహన పెంచుకుంటూ, పరిష్కారాలు కనుక్కోగలుగుతారు. ఇది విద్యార్థులకు నిజమైన ఇంటరాక్టివ్, ఆకర్షణీయమైన అభ్యాస అనుభవాన్ని అందించడానికి ఉద్దేశించిందని ఓపెన్ ఏఐ నిర్వాహకులు చెబుతున్నారు. అంటే, ఇకపై పిల్లలు కేవలం కాపీ-పేస్ట్ చేయకుండా, నిజంగా నేర్చుకుంటారు అన్నమాట! స్టడీ మోడ్ ఫీచర్ ప్రస్తుతం ఫ్రీ, ప్లస్, ప్రో, టీమ్ ప్లాన్‌లలో లాగిన్ అయిన వినియోగదారులందరికీ అందుబాటులో ఉంది. ఈ సరికొత్త స్టడీ మోడ్ విద్యార్థులకు ఎంతవరకు సాయపడుతుందో, వారి స్కిల్స్‌ను ఏమేరకు పెంచుతుందో చూడాలి!

# బరువు తగ్గే, షుగర్ కంట్రోల్‌లోకి వచ్చే మంచి డైటింగ్ విధానం ఇదే.. ట్రై చెయ్యండి



చాలామంది బరువు తగ్గడానికి కీటో డైట్‌ను ఫాలో చేస్తూ ఉంటారు. కీటో డైట్ అంటే తక్కువ కార్బోహైడ్రేట్లను కలిగి, ఎక్కువ కొవ్వులు మరియు కొంత ప్రోటీన్లను కలిగి ఉన్న ఆహారం. ఇది శరీరానికి శక్తిని ఇవ్వడంతోపాటు మన శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. ఇది కీటోసిస్ అనే ప్రక్రియకు దారితీస్తుంది. సహజంగా కీటో డైట్ బరువు తగ్గడం కంటే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

కీటో డైట్ తో డయాబెటిస్ కంట్రోల్.. కీటో డైట్ యొక్క ఒక ముఖ్యమైన ప్రయోజనం రక్తంలో చక్కెర నియంత్రణ . కార్బోహైడ్రేట్లను తీసుకోవడం తగ్గించడం ద్వారా, రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి. ఇది టైప్ 2 మధుమేహం లేదా ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్న వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉండవచ్చు. కీటో డైట్ అనుసరించే అనేక మంది మెరుగైన మానసిక స్పష్టత మరియు దృష్టిని పొందినట్టు చెప్తారు. శక్తికి, మెదడు ఉత్తేజానికి కీటో డైట్.. మన మెదడు కీటోన్లను సమర్థవంతమైన ఇంధన వనరుగా ఉపయోగిస్తుంది. ఇది మెరుగైన జ్ఞాపకశక్తికి దారితీస్తుంది. ఇది మెదడుకు సంబంధించి ఏకాగ్రత సమస్యలను ఎదుర్కొంటున్న వారికి ప్రత్యేకంగా సహాయపడుతుంది.కీటో డైట్ తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం శక్తి స్థాయిలు పెరుగుతాయి. శరీరం శక్తి కోసం కొవ్వును కరిగించడానికి అనుకూలంగా మారినప్పుడు, చాలా మంది రోజంతా నిరంతర శక్తి పెరుగుదలను గమనిస్తారు. ఈ ఆరోగ్య సమస్యలకు కీటో డైట్ తో ఉపశమనం ఇది మెరుగైన శారీరక పనితీరును కనబరుస్తుంది. కీటో డైట్ తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కీటో డైట్ మన శరీరంలోని మంచి కొలెస్ట్రాల్ అయిన హెచ్డిఎల్ ను పెంచడంతోపాటు, ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ ను తగ్గించడం, ట్రై గ్లిజరైడ్స్ ను తగ్గించడం చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుంది. ఆర్థరైటిస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఉన్నవారికి శరీరంలో వచ్చే నొప్పులు మంటలను తగ్గించడానికి కీటో డైట్ దోహదం చేస్తుంది. మధుమేహ బాధితులు ఇవి నిర్లక్ష్యం చేస్తే మంచంలోనే జీవితం

కీటో డైట్ పాటించాలంటే వైద్యుల సలహా తప్పనిసరి.. కీటో డైట్ మన ఆకలిని తగ్గిస్తుంది. కేవలం బరువు తగ్గడం మాత్రమే కాదు కీటో డైట్ ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో రక్తంలో చక్కెరను నియంత్రించడంతో పాటు శక్తిని అందించడం వంటి ఫలితాలు ఉన్నాయి. మొత్తంగా కీటో డైట్ మన శరీరానికి ఎంతగానో దోహదం చేస్తుంది. అయితే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వైద్య నిపుణుల సలహాలు లేకుండా కీటో డైట్ ను పాటించడం మంచిది కాదు.

# చిత్త వైకల్యాన్ని చిత్తుచేద్దాం!



చిత్త వైకల్యాన్ని సకాలంలో నిర్ధారించడం.. ప్రధాన సవాలుగా మారుతున్నది. మనిషి జ్ఞాపకశక్తిని దెబ్బతీసే ఈ మానసిక రుగ్మత.. చాలా ఆలస్యంగా బయటపడుతున్నది. లక్షణాలు కనిపించినా.. సంపూర్ణంగా నిర్ధారించడానికి సగటున మూడున్నరేండ్ల సమయం పడుతున్నది. 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జెరియాట్రిక్ సైకియాట్రీ'లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. డైమెన్షియా నిర్ధారణపై 'యూనివర్సిటీ కాలేజ్ లండన్'లోని సైకియాట్రీ విభాగానికి చెందిన పరిశోధకులు తాజాగా ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా, చైనాలో ఇంతకుముందే ప్రచురితమైన 13 అధ్యయనాలను క్షుణ్నంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 30,257 మందికి చెందిన డేటాను సమీక్షించారు. ఇందులో భాగంగా.. చిత్త వైకల్యం ప్రపంచవ్యాప్తంగా 57 మిలియన్లకు పైగా ప్రజలను ప్రభావితం చేస్తున్నదని గుర్తించారు. చాలా దేశాలలో రోగ నిర్ధారణ సరిగ్గా జరగడం లేదని చెబుతున్నారు. చిత్త వైకల్యం ప్రారంభ దశలో జ్ఞాపకశక్తి కోల్పోవడం, పదాలను కనుగొనడంలో ఇబ్బంది, గందరగోళంతోపాటు మానసిక స్థితి, ప్రవర్తనలో మార్పులు కనిపిస్తాయని అధ్యయనకారులు పేర్కొంటున్నారు. చాలామంది ఈ డైమెన్షియా లక్షణాలను సాధారణ వృద్ధాప్య లక్షణాలుగా భావిస్తున్నారనీ, దాంతో వారికి సరైన వైద్యసాయం అందడం లేదని అంటున్నారు. కొందరిలోనైతే.. రోగ నిర్ధారణకు 4.1 ఏళ్లు పట్టవచ్చునని పేర్కొంటున్నారు. దాంతో బాధితులకు మెరుగైన చికిత్స అందించడం ఆలస్యమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని నివారించడానికి.. డైమెన్షియా ప్రారంభ లక్షణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ, చిత్త వైకల్యం ఉన్న వ్యక్తులు, వారి కుటుంబాలు అవసరమైన సహాయం పొందగలిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తున్నారు. సకాలంలో రోగ నిర్ధారణ చేయడం వల్ల మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# మార్కెట్

## వృద్ధిరేటుకు ఊచకోతే..! ట్రంప్ టారిఫ్‌లతో దేశ జీడీపీ ప్రగతికి బ్రేకులు

న్యూఢిల్లీ : వాణిజ్య ఒప్పందం కోసం భారత్ మెడలు వంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా విధించిన సుంకాలు.. దేశ జీడీపీ ప్రగతికి ప్రతిబంధకాలేనని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లుంటాయని ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే ఈ టారిఫ్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తం కొనసాగితే దేశ జీడీపీ ఈసారి 6 శాతం దిగువనే నమోదు కాగలదని ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారిప్పుడు. 20 నుంచి 40 బేసిస్ పాయింట్లు దిగజారవచ్చని అంతా అభిప్రాయపడుతున్నారు. ఏఎన్‌జెడ్ ఎకనామిస్టులు ధీరజ్ నీమ్, సంజయ్ మాథుర్ స్పందిస్తూ.. 'అమెరికా 25 శాతం టారిఫ్‌లు వచ్చే ఏడాది మార్చి 31దాకా అమలైతే భారత జీడీపీ వృద్ధిరేటు 40 బేసిస్ పాయింట్లు క్షీణించవచ్చు' అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ 6.1 శాతంగానే ఉంటుందని వారి అంచనా. దీంతో ట్రంప్ టారిఫ్ దెబ్బకు 5.5 శాతం దరిదాపుల్లోకి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బార్క్‌లేస్ 30 బేసిస్ పాయింట్లు, నొమురా 20 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్నాయి. అలాగే ఫిచ్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ 6.3 శాతంగానే ఉండొచ్చని అంచనా వేసింది. మునుపు 6.4 శాతంగా ఉన్నది. ఇక పెట్టుబడులకూ ఇబ్బందేనని హెచ్ఎస్‌బీసీ ఆర్థికవేత్తలు చెప్తున్నారు.



# ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీకి ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా.. ఎంతంటే..!



అగ్రరాజ్యం అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ కంపెనీ టెస్లాకు ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా విధించింది. 2019లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించి అప్పట్లో టెస్లా కంపెనీ పై కేసు నమోదైంది. టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థలో లోపంవల్లే ఆ ప్రమాదం జరిగిందని తాజాగా ఫ్లోరిడా కోర్టు తేల్చింది. బాధిత కుటుంబానికి 240 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో సుమారుగా రూ.1,996 కోట్లు) చెల్లించాలని టెస్లాను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. ఫ్లోరిడాలోని కీ లార్గోలో 2019 లో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. జార్జ్ మెక్ గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళుతూ అత్యాధునిక ఆటో పైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమద్యంలో జార్జ్ మొబైల్ కారులో కింద పడిపోయింది. కారు ఆటో పైలట్ మోడ్‌లోనే ఉండటంతో జార్జ్ కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. దాంతో ఆ కారు అదుపు తప్పి పక్కనే పార్క్‌చేసి ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఆపై ఇద్దరు వ్యక్తులపైకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ ప్రమాదానికి నష్టపరిహారంగా బాధిత కుటుంబాలకు మొత్తం 329 మిలియన్ డాలర్లు చెల్లించాలని కోర్టు కారు యజమానిని ఆదేశించింది. అయితే ప్రమాదానికి ఆటో పైలట్ వ్యవస్థ లోపం కూడా ఒక కారణమని గుర్తించిన కోర్టు.. ఆ మొత్తం పరిహారంలో 242 మిలియన్ డాలర్లను టెస్లా కంపెనీ చెల్లించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. ప్రమాదానికి కారకుడైన కారు యజమాని మిగతా మొత్తం చెల్లించాలని స్పష్టంచేసింది. అయితే ఫ్లోరిడా కోర్టు తీర్పుపై పై కోర్టులో అప్పీల్ చేయనున్నట్లు టెస్లా సంస్థ తెలిపింది.



## అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు.. ఈ నెల 5న హాజరుకావాలని ఆదేశం

### జారీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

న్యూఢిల్లీ : బ్యాంకుల రుణాల ఎగవేత కేసుల్లో రిలయన్స్‌గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీకి గట్టి షాక్ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) లుకౌట్ నోటీసులు జారీ చేసింది. రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసుకు సంబంధించి ఈడీ శుక్రవారం సర్క్యూలర్ జారీ చేసింది. లుకౌట్ నోటీసుల కంటే ముందు బ్యాంక్ రుణ ఎగవేత కేసులో అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ నెల 5న న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో కంపెనీకి చెందిన ఇతర ఉన్నతాధికారులకు కూడా త్వరలో సమన్లు జారీ చేసే అవకాశాలున్నట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి.

# ఆంధ్రప్రదేశ్

## తుని జ్ఞానేశ్వరి అదృశ్యం బాధాకరం

### కుటుంబ సభ్యులకు మంత్రి అనిత ఓదార్పు
### ఆచూకీ కోసం కృషి చేస్తున్నామని వెల్లడి

కాకినాడ,జూన్17 : తునిలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి కుటుంబసభ్యులను హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రెండేళ్ల చిన్నారి అదృశ్యమవడం చాలా బాధాకరమన్నారు. పాప కనిపించకపోవడంతో తల్లడిల్లుతున్న జ్ఞానేశ్వరి తల్లిబాధ వర్ణణాతీతమని అన్నారు. పాప మిస్సయిన విషయం తెలుసుకొన్న వెంటనే పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. టెక్నికల్‌కు సంబంధించిన ఆధారాలే కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో వివిధ బృందాలు జల్లెడ పడుతున్నాయని చెప్పారు. పాప మిస్సింగ్ విషయంలో ప్రభుత్వం ఎక్కడా అలసత్వం వహించలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ప్రతిరోజు ఈ అంశం మీద మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. పాప ఆచూకీ దొరికే వరకూ గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు. జ్ఞానేశ్వరి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా భరోసాగా ఉంటుందని అన్నారు. సోషల్ మీడియా, కొన్ని యూట్యూబ్ ఛానల్లలో అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. తక్షణమే అలాంటి అసత్య ప్రచారాలను నిలిపివేయాలని.. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి అనిత హెచ్చరించారు.

## అనితపై వైసిపి నేత గుడివాడ వ్యాఖ్యలు దుర్మార్గం

### మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పలువురు మహిళా నేతలు

అమరావతి,జూన్17 : హోంమంత్రి అనితసపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్‌కు మహిళా నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన మహిళా నేతలు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హోంమంత్రి అనితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. రాజకీయాల్లో విమర్శలు, విధానాలు.. నిర్ణయాలకే పరిమితం కావాలని మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు, వ్యక్తిగత అంశాలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజానికి తప్పుడు సందేశాలను పంపుతుందని మహిళా నేతలు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌ను మహిళలు కోరారు. దీనిపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ స్పందిస్తూ.. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అందిన ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని శైలజ హామీ ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిపై సామూహిక అక్షరాభ్యాసం

### భారీగా తరలివచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులు

విజయవాడ,జూన్17 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిజ జేష్ఠ తదియ సందర్భంగా ఈ మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకే మహా మండపం 6వ అంతస్తుకు భారీ ఎత్తున ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. చిన్నారితో పాటు తల్లిదండ్రులకు మాత్రమే అమ్మవారి దర్శనానికి అనుమతి ఇవ్వనున్నారు. ఉదయం 8:06 గంటలకు శుభ ముహూర్తంలో అక్షరాభ్యాసం ప్రారంభమైంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవోపేతంగా అక్షరాభ్యాస కార్యక్రమం మొదలైంది. పలక, బలపం, పూజా సామాగ్రిని ఆలయ అధికారులు ఉచితంగా అందజేస్తున్నారు. అక్షరాభ్యాసం అనంతరం అమ్మవారి దర్శనం, ప్రసాదాలు ఉచితంగా ఇవ్వనున్నారు. సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం సందర్భంగా సమయపాలన పాటించాలని భక్తులకు ఈవో శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.

## డిఎస్సీపై దమ్ముంటే చర్చకు రావాలి

### ఆరోపణలు కాదు..ఆధారాలు చూపాలి
### జగన్‌కు మంత్రి లోకేశ్ సవాల్

గుంటూరు,జూన్17 : వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఏపీ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీపై తాడేపల్లి ప్యాలెస్‌కు కూతవేటు దూరంలో ఉండి మరీ ఛాలెంజ్ చేశారు మంత్రి. 'జగన్ ఇంటికి 200 మీటర్ల దూరంలో నిలబడే మాట్లాడుతున్నా.. డీఎస్సీపై అనుమానాలుంటే సమాధానం చెప్పేందుకు ఇక్కడే సిద్ధంగా ఉన్నా. సవాల్ స్వీకరించే ధైర్యం ఉన్నవాళ్లు చర్చకు రావాలి. జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ నియామకాలు ఆపలేరు. మేం సాక్షి క్యాలెండర్ కాకుండా నిజమైన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తున్నాం. ఒక్క డీఎస్సీ అయినా నిర్వహించి ఉంటే హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లు అర్థమవుతాయి' అంటూ వ్యాఖ్యానించారు. పులివెందుల ఎమ్మెల్యే.. బెంగళూరు, హైదరాబాద్ వీడి ఏపీ వైపు చూస్తే అభివృద్ధి కనిపిస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రిజనరీ చుట్టూ ఎప్పుడూ రౌడీలే ఉంటారని మంత్రి అన్నారు. మహిళల్ని కించపరిచే వారిని, తిట్టేవారిని తన చుట్టూ ప్రిజనరీ పెట్టుకుంటారంటూ దుయ్యబట్టారు. కోడిగుడ్డుకు పరిశ్రమకు తేడా తెలియని వాళ్లు మంత్రులుగా చేయబట్టే పరిశ్రమలు పారిపోయాయంటూ మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ అద్భుతంగా మాట్లాడారని జగన్ కితాబివ్వటం దురదృష్టకరమన్నారు. భారతీరెడ్డి, తన ఇద్దరు కూతుళ్లని.. హోం మంత్రిని అవమానించినట్లు అవమానిస్తే కూడా జగన్ శభాశ్ అంటారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీది ఆ సంస్కృతి కాదు కాబట్టే జగన్ కుటుంబసభ్యుల్ని కించపరిచిన వారిపైనా చర్యలు తీసుకున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

### అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననం
### జగన్, వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి



అమరావతి,జూన్17 : మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీపై గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ నేతల బూతులు ప్రజలు వినలేకపోయారని అన్నారు. గత రెండేళ్ల నుంచి రాష్ట్రంలో బూతుల గోల లేదని, ప్రజలు ప్రశాంతంగా ఉంటే ఉనికి చాటుకునేందుకు గొడ్డలి పార్టీ నేతలు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మహిళల్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మారడం లేదని, ఇంగితం లేకుండా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహిళలపై ద్వేషంతోనే వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ డీఎన్ఏ అని రాజ్యసభ సభ్యులు సానా సతీశ్ వ్యాఖ్యానించారు. తన రాజకీయ పబ్బం కోసం జగన్ కాపులను బలిపశువుల్ని చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు.. జగన్ కుట్రలను తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా మళ్లీ కులాల మధ్య చిచ్చుకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. జగన్ కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్‌నాథ్ దిగజారేలా హోం మంత్రి అనితపై విమర్శలు చేశారన్నారు. మహిళలంటే జగన్‌కు మొదటి నుంచీ ద్వేషమని.. కన్న తల్లి, సొంత చెల్లిని గెంటేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ బేషరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వైసీపీ నేతల చిన్నచూపుకు ఇది నిదర్శనమమని సతీశ్ అన్నారు. అహంకారంతో మహిళలను అవమానిస్తే సహించబోమన్నారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ వైఖరి ఇలాగే ఉంటే 2029లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. కష్టపడి స్వశక్తితో ఉన్నత స్థానానికి చేరుకున్న అనిత పట్ల ఇటువంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని సానా సతీశ్ తెలిపారు.

## ఎపిలో విస్తరించిన ద్రోణి

### ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
### ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి

అమరావతి,జూన్17 : తూర్పు విదర్భ - తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రంలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. కోస్తాంధ్ర జిల్లాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని సూచించింది. బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రైతులు, కూలీలు, పశువుల కాపరులకు విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఊాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని వివరించింది. విజయనగరం జిల్లా వేపాడలో అత్యధికంగా 96.7 మిల్లీమీటర్లు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 72 మి.మీ, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 69.01 మి.మీ, నర్సీపట్నంలో 66.5 మి.మీ., వజ్రపు కొత్తూరులో 65.8 మి.మీ., నంద్యాల జిల్లా టంగుటూరులో 64.4 మి.మీ., అనకాపల్లి జిల్లా బలిఘట్టం, రావికమతంలో 57.7 మి.మీ., శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 45.2 మి.మీ. వర్షపాతం నమోదైందని వివరించింది. వాతావరణ హెచ్చరికలను గమనించి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో అవసరమైతే మాత్రమే బయటకు రావాలని ప్రజలకు ఆ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం

### ఆర్థికంగా వెనకబడ్డ దేశాలను ఆదుకోవాలి
### జి-7 సైదస్సులో ప్రధాని మోడీ వెల్లడి

ప్యారిస్,జూన్17 : ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయమన్నారు. వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి..ఎవరికి వృద్ధి.. అది ఏ దిశలో ఉంది.. అనే అంశాలను చర్చించాలని మోదీ పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతోన్న దేశాలు ఈ షాక్‌లను తట్టుకొనేలా వ్యవస్థలు ఉండాలన్నారు. ఆయా దేశాల్లో ఉన్న మానవ వనరులను ప్రపంచ అభివృద్ధి భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

### భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం
### హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం
### ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ
### మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య

ప్యారిస్,జూన్17 : హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోడీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.



## ఇండో-పసిఫిక్ కమాండ్ పేరును మార్చేసిన అమెరికా

### యునైటెడ్ స్టేట్స్ పసిఫిక్ కమాండ్‌గా మార్పు

వాషింగ్టన్,జూన్17 : ఫ్రాన్స్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరుగుతున్న సమయంలో చోటు చేసుకున్న ఓ కీలక పరిణామం ఇరు దేశాల మధ్య సమస్యలను సృష్టించేలా కనిపిస్తోంది. అమెరికా తన కీలక సైనిక కమాండ్ అయిన 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును మార్చింది. 'ఇండో'ను తొలగించి 'యునైటెడ్ స్టేట్స్ పసిఫిక్ కమాండ్' అని నామకరణం చేసింది. ఈ సైనిక కమాండ్ ఎక్కడెక్కడ పని చేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో అమెరికా రక్షణ శాఖ ఓ మ్యాప్‌ను ఉంచింది. ఆ మ్యాప్‌లో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్‌లో భాగంగా చూపించింది. దీంతో వివాదం మరింత ముదిరింది. కాగా, సైనిక కమాండ్ పేరు మార్పు కేవలం చారిత్రక వారసత్వాన్ని (¡÷ఇజీఞా) పునరుద్ధరించడానికేనని, కమాండ్ బాధ్యతలు, వ్యూహాత్మక లక్ష్యాలు లేదా కార్యకలాపాల్లో ఎలాంటి మార్పు ఉండదని అమెరికా రక్షణ శాఖ స్పష్టం చేసింది. 947 జనవరి 1న నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రుమ్యాన్ యూఎస్ పసిఫిక్ కమాండ్‌ను ఏర్పాటు చేశారు. అమెరికా వెస్ట్ కోస్ట్ నుంచి భారత పశ్చిమతీరం వరకు గత ఏడు దశాబ్దాలుగా ఈ కమాండ్ సేవలందిస్తోంది. అయితే ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత 2018లో దీని పేరును 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్'గా మార్చారు. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అమెరికా యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

### 12మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్

హైదరాబాద్,జూన్17 : హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఉదంతం కలకలం రేపింది. దీనిపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడ్డ పలువురు విద్యార్థులను ఆరునెఉలలపాటు బహిష్కరించినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ తొమ్మిదో తేదీన కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బీడీఎస్ విద్యార్థులు తమపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం, ఆ రోజే సదరు ఫైల్ ఇయర్ విద్యార్థులను పిలిపించి గట్టిగా మందలించింది. అయితే, యాజమాన్యం హెచ్చరించిన 24 గంటలు తిరగకముందే సీనియర్ విద్యార్థులు మరోసారి ర్యాంకింగ్‌కు పాల్పడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాగింగ్‌కు పాల్పడిన మొత్తం 12 మంది విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. 'జూనియర్లతో సీనియర్లు ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడంతో పాటూ కూలర్లలో నీళ్లు నింపడం వంటి పనులు చేయిస్తూ వేధించేవారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన హాస్టల్లోని సీసీ కెమెరాలను పగలగొట్టడమే కాకుండా, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా, సదరు విద్యార్థులు యాజమాన్యానికి క్షమాపణలు చెప్పి, మరోసారి ఇలాంటి తప్పులు చేయబోమని నమ్మించారు. కానీ, వాళ్ల బుద్ధి మారలేదు.. మరోసారి అదే తరహా ప్రవర్తనతో జూనియర్లను వేధించారు. ఈ క్రమంలోనే 12 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం అని తెలిపారు. అలా చేయడం వల్ల పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంటుందని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయం అని అన్నారు. ఇది వారికి గుణపాఠం కావాలన్నారు. అలాగే మిగతా వారికి ఓ హెచ్చరిక అన్నారు. ఇదిలావుంటే ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకిదిగారు.

### హైదరాబాద్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్,జూన్17 : ప్రముఖ విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ టెస్లా 2026 మోడల్ వై ప్రీమియమ్ రేర్ వీల్ డ్రైవ్, మోడల్ వై ఎల్ వాహనాలను వినియోగదారులు పరిశీలించొచ్చని టెస్లా వెల్లడించింది. టెస్లాలో వాడుతన్న సాంకేతికత, భద్రతా ఫీచర్లు, వాహన పనితీరును పరిశీలించ వచ్చని పేర్కొంది. దీంతో పాటు బొల్లారం పారిశ్రామిక వాడలో డెలివరీ, విక్రయానంతర సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.



# వారికి థాంక్స్ చెప్పాలి!

కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఎన్నో తిరస్కారాలు తనలో పట్టుదలను పెంచాయని, వాటన్నింటినీ ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేయడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పింది కథానాయిక మృణాల్ ఠాకూర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ భామ ఇండస్ట్రీలో తన తొలినాటి రోజుల్ని గుర్తుచేసుకుంది.'ఆడిషన్స్‌కు వెళ్లిన చాలా సందర్భాల్లో నేను నటనకు పనికిరానని చెప్పేవారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ఎలాగైనా సరే సినీ రంగంలో రాణించాలనుకున్నా. ప్రతి రోజు కొత్త విషయాలను తెలుసుకుంటూ నా నటనను మెరుగుపరచుకున్నా. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఈ స్థాయికి వచ్చాను. నన్ను తిరస్కరించిన వారికి కృతజ్ఞతలు చెప్పాలి. వారి వల్లే మరింత పట్టుదలతో కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నా' అని మృణాల్ ఠాకూర్ చెప్పింది. పాత్రలో పరకాయ ప్రవేశం చేసినప్పుడు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటామని, 'సీతారామం' చిత్రంలో సీతామహాలక్ష్మీ పాత్రను ప్రాణం పెట్టి చేశానని, అందుకే ఆ క్యారెక్టర్ ఇప్పటికీ గుర్తుండిపోయిందని ఈ భామ చెప్పుకొచ్చింది. ఆమె విజయ్ దేవరకొండ సరసన నటించిన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది.




## ఆల్ఫా ట్రైలర్ విడుదల

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

## జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి


ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.

# మరింత మెరుగ్గా సింగ్ గీతం గ్రాఫిక్స్

ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' జూన్ 12న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా క్షి రిలీజ్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు నాగ్ అశ్విన్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఈ సినిమా ఓటీటీ వెర్షన్.. థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉంటుంది' అని నాగ్‌అశ్విన్ వెల్లడించారు. నిర్మాణదశ చివర్లో ఎదురైన సవాళ్ల గురించి ఆయన ప్రస్తావిస్తూ.. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించింది. డిజిటల్ విడుదలకు ముందు, గ్రాఫిక్స్‌ని మరింత మెరుగు పరచడానికి మా బృందం యోచిస్తోంది. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తూనే ఉంటారు. అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని భావించాం' అని పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ప్లిక్స్‌కి విక్రయించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. అందువల్ల ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది.








# పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ సాంగ్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి' అనే పాటకి సంబంధించిన ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్, మాస్ కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచాయి. చరణ్ రగ్డ్ లుక్‌లో, ఊర మాస్ స్టెప్పులతో ఇరగదీయగా, జాన్వీ కపూర్ ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో కుర్రకారు మతులు పోగొడుతోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

## అపజయాల గురించి ఆలోచించను: రష్మిక

వరుస విజయాలు అందుకుంటూ జోష్ మీద ఉన్నారు రష్మిక ఇటీవల 'యానిమల్'లో తన నటనతో మెప్పించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను విజయాలను పెద్దగా పట్టించుకోనన్నారు. దానికి గల కారణాన్ని వివరించారు. నాకంటే అందమైన, తెలివైన అమ్మాయిలు చాలామంది ఉన్నారు. వాళ్లు నటనలోనూ ప్రతిభావంతులే. మనల్ని మనం నిరూపించుకునే అవకాశం కొద్దిమందికే వస్తుంది. నాకు అలాంటి అవకాశాలు వచ్చాయి కాబట్టే ఈ స్థానంలో ఉన్నాను. నన్ను గుర్తించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పాలి. కెరీర్‌లో సాధించిన జయాపజయాలను పట్టించుకోకూడదు. ఏ రంగంలోనైనా అవి సాధారణం. ఇటీవలే ఈవిషయాన్ని తెలుసుకున్నాను. మనం చేసే ప్రతీ పనిని ప్రేక్షకులు గమనిస్తారు. ప్రశంసలు, విమర్శలు ఎదురవుతాయి. వాటి గురించి ఆలోచిస్తే మానసికంగా కుంగిపోతాం. జీవితంలో ముందుకుసాగలేం. అందుకే వాటిని పట్టించుకోను అని చెప్పారు. ప్రస్తుతం రష్మిక తెలుగు, హిందీల్లో వరుసగా సినిమాలు చేస్తున్నారు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ తెరకెక్కిస్తున్న 'పుష్ప2'లో నటిస్తున్నారు. అందులో శ్రీవల్లిగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'పుష్ప' బాక్సాఫీసు వద్ద అత్యధిక వసూళ్లు రాబట్టడం, అందులోని నటనకుగాను అల్లు అర్జున్‌కు జాతీయఅవార్డు రావడం, దేవిశ్రీ ప్రసాద్‌కు ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ పురస్కారం దక్కడంతో ఈ సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన రష్మిక లుక్‌కు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com